MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 1 రంగారెడ్డి సెప్టెంబర్ 2021 పేజీలు : 36 వెల : రూ. 10/-






ఎఫ్ పి ఓ లు , ఎన్ జి ఓ ల ప్రతినిధులతో అనంతపురం జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ప్రభృతులు



నాబార్డ్ తెలంగాణా ఎఫ్ పి ఓ ల సి ఇ ఓ లకు శిక్షణ



సి ఆర్ పి ఇ పి లకు ఇ డి పి శిక్షణానంతర దృశ్యం





పీలేరు ఎఫ్ పి సి తృతీయ వార్షికోత్సవ మహాసభ



నల్లమడ ఎఫ్ పి ఓ నాల్గవ వార్షికోత్సవ సభలో పండ్ల మొక్కల పంపిణీ



కలికిరి లో రైతు సమృద్ధి సేవా కేంద్రం ప్రారంభోత్సవం

NABARD

నాబార్డ్ సౌజన్యంతో


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
మరుగుదొడ్డి ఉపయోగించడం వల్ల మీకు కలిగే ప్రయోజనాలు:
• మీ ఇంటిలో పరిశుభ్రత ఉంటుంది • వివిధ జబ్బులకు దూరంగా ఉంటారు
• ఆరోగ్యకరమైన మరియు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది
• పరిశుభ్రంగా ఉంటారు మరియు కరోనాను దూరంగా పారదోలతారు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 20 సంచిక 1




సంపాదకీయం

## ముందు చూపు!

మన తెలుగు రాష్ట్రాలలో ఈ సీజన్‌లో విస్తారంగా వానలు కురిశాయి. అక్కడక్కడా కొద్దిగా ఆలస్యమైనా, ఎక్కడో ఏవో కొన్ని ప్రాంతాలలో తప్ప, చాలా చోట్ల సాధారణ వర్షపాతాన్ని మించి వానలు పడ్డాయి. రైతులంతా వ్యవసాయపు పనులలో తలమునకలై వున్నారు. చేతినిండా పనివుంటే అన్నదాతకు సంబరం, అన్నదాత నడుం బిగిస్తే లోకానికి భోజనం! ఇది శుభ పరిణామం. మరింత ఆనందకరమైన విషయం ఏమిటంటే రైతులు ఎవరికి వారు ఒంటరిగా వ్యవసాయపు పనులు, కొనుగోళ్ళు, అమ్మకాలు సాగించడంలోని సాధకబాధకాలను, సంఘటిత కృషిలోని ప్రయోజనాలను అర్ధంచేసుకుని, కలసికట్టుగా ముందడుగు వేయడానికి నానాటికి మరింత మక్కువ చూపుతున్నారు. మన ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాదు మొత్తందేశంలోనే, ఆ మాటకు వస్తే ప్రపంచ వ్యాప్తంగా కూడా రైతులలో ఈ నవ చైతన్యం తొణికిసలాడుతున్నది. అటు ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు, యిటు ఏపిమాస్ వంటి వివిధ సాంకేతిక నైపుణ్య స్వచ్ఛంద సంస్థలు సమకూరుస్తున్న మార్గదర్శనం, అందిస్తున్న అండదండలతో రైతులు సంఘాలుగా, సమాఖ్యలుగా, 'వ్యవసాయ ఉత్పాదక సంస్థలు' గా (ఎఫ్ పి ఓలు / ఎఫ్ పి సిలు గా) ఏర్పడి, ఉమ్మడిగా వనరులు సమకూర్చుకుంటూ, మార్కెట్ తీరుతెన్నులపట్ల అవగాహన పెంచుకుని, డిమాండ్‌కు అనుగుణమైన, నాణ్యమైన ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తూ, కలసికట్టుగా క్రయవిక్రయాలు సాగిస్తూ, తమ ఆదాయాన్ని పెంచుకోగలుగుతున్నారు, సామాజిక అవసరాలను తీర్చగలుగుతున్నారు. ఇది ఎంతైనా అభినందించదగిన, ఆహ్వానించవలసిన పరిణామం. తాము సాగుచేస్తున్న పొలంలోని మట్టి స్వభావం ఏమిటో, ఏ పంటలకు అది అనుకూలమో, ఏ పంటలు సరిగా పండవో, వాన నీటిని ఒడిసిపట్టి యింకించుకునే విధంగా పొలాన్ని సిద్ధం చేసుకోవడం ఎలానో, నీటి సంరక్షణ చర్యలను ఎలా చేపట్టాలో, భూసారానికి, వాతావరణ పరిస్థితులకు, వేసిన పంటలకు అనుగుణంగా, పంటలకు, వినియోగదారులకు హానికరం కాకుండా, దిగుబడులను పెంచే ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడాలో, పండిన పంటలను తగిన రీతిలో ఏ విధంగా నిల్వచేసుకోవాలో, నష్టం రాకుండా చెప్పుకోదగినంత ఆదాయం వచ్చే విధంగా ఎక్కడ ఎలా విక్రయించుకోవాలో సరియైన అవగాహన లేక, అప్పులపాలై ఆత్మహత్యలకు తలపడే ఆనాటి స్థితితో పోల్చి చూస్తే, గత కొన్ని సంవత్సరాలుగా రైతు ప్రస్థానం ఎంతో మెరుగుపడిందనేది కాదనలేని నిజం! ఈ అభ్యుదయ ప్రస్థానంలో మార్గదర్శక భాగస్వామిగా వుండడం ఏపిమాస్ కు ఎంతైనా గర్వకారణమైన విషయం. భవిష్యత్తులో మరెంతో మహోజ్వలమైన ఘట్టానికి యిది నాంది! అయితే, అందివస్తున్న అండదండలను, కలిగిన భరోసాను, పెరిగిన ఆదాయాలను సద్వినియోగం చేసుకునే విధంగా మన జీవన విధానాన్ని నియంత్రించుకోకుండా, అనవసరమైన ఆడంబరాలకు, ఆదాయాన్ని మించిన ఖర్చులకు పాల్పడితే, ఎన్నో కష్టనష్టాలకు, త్యాగాలకు ఓర్చి సాధించుకున్న ఈ విజయాలు, సత్ఫలితాలు నిరర్ధకమవుతాయి. ఈ విషయంలో మానవజాతి చరిత్రలోనే ఒక మహోన్నత ప్రస్థానంగా జేజేలందుకుని, పేదరిక నిర్మూలనకోసం ప్రపంచ వ్యాప్తంగా సాగిన, సాగుతున్న స్వయంసహాయ మహోద్యమంనుంచి మనం పాఠాలు నేర్చుకోవలసి వుంది. ప్రారంభంలో వెలుపలి నుంచి అందే తోడ్పాటును అందిపుచ్చుకుని, స్వయంశక్తితో, సంఘటిత కృషితో అనుగుణమైన జీవనోపాధులను ఏర్పాటు చేసుకుని, ఆదాయాన్ని పొందుతూ, పేదరికం నుంచి బయటకు రావడంకోసం ఉద్దేశించిన ఈ ఉద్యమం తొలిదశలో అద్భుతంగానే సాగినా, పెరిగిన ఆదాయాలను మదుపు చేసుకోవడంలో ఆలసత్వం, తాహతుకు మించి ఆడంబరాలకు అలవాటుపడడం కారణంగా , స్వయంశక్తి, స్వావలంబన లోపించి, ఎప్పుడూ ప్రభుత్వ సహాయానికి ఎదురుచూస్తూ, అప్పులు రద్దవుతాయిలే అనే దురుద్దేశంతో చెల్లింపులు సక్రమంగా సాగించకుండా, అనుత్పాదకమైన అప్పులకు తావిస్తూ, ఆశించిన ఫలితాలను సాధించడంలో తడబడుతున్నదని పరిశీలనలు, అధ్యయనాలు పేర్కొంటున్నాయి. రైతు సంస్థలు ఈ పరిణామాలను కూడా గమనించి, తమ సభ్యరైతులు పెరిగే ఆదాయాలను దుర్వినియోగపరచుకోకుండా ముందుచూపుతో తమ కుటుంబాలు మరింత భరోసాగా మెరుగైన జీవితం గడపడానికి, ఆడంబరాలకు కాకుండా అవసరాలకు ఖర్చుచేస్తూ, ఆత్మగౌరవంతో జీవిస్తూ, రేపటికోసం ఎంతో కొంత పొదుపు చేస్తూ, తమ పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్ది 'రైతే రాజు' అనే నానుడిని తిరిగి నిజంచేసే విధంగా సదవగాహన కల్పించాలి. ' ముందుచూపు లేనివాడు ఎందులకూ కొరగాడు ' అనే విషయం మరువకూడదు సుమా !


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.Chandra Sekhar Reddy


ఇతరులు నిన్ను అర్థం చేసుకోలేదని బాధపడడం కాదు, ముందుగా నిన్ను నీవు అర్థంచేసుకో

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

- ఏపిమాస్ భాగస్వామ్యంలో కోవిడ్‌పై పోరాటం ...05
- ఎఫ్‌పిఓ లను బలోపేతం చేయాలి : కలెక్టర్ ...06
- చేయూత... అభివృద్ధి ఘనత ! ...07
- రైతులకోసం ఐదు ముఖ్య పథకాలు ! ...08
- 1.15 కోట్ల ఎకరాలకు చేరిన సాగు ...09
- ఏ గేదెను ఎంచుకోవాలి ? ఎలా పోషించాలి? ...10
- అధిక పోషకాలను అందించే చిరుధాన్యాలు ...12
- ఆరోగ్యాన్ని, బలాన్ని అందించే రాగులు ! ...14
- గ్రామీణ రైతులే యంత్రాల ఆవిష్కర్తలు! ...16
- కరోనా కల్లోలంలో బాలకేంద్రం కళార్చన ! ...18
- మల్చింగ్ షీట్ వేయడం ... ఇక సులభం ! ...20
- భూమిలో మూడంతస్తులుగా కూరగాయలసేద్యం ...26
- కాలి పగుళ్ళకు చిట్కా వైద్యం ! ...28
- నిద్ర ఎక్కువ, తక్కువైనా మగాళ్ళకు మధుమేహం...29
- రైతు సంస్థలకు నాబ్ కిసాన్ రుణాలు ...29
- పశువులకు పచ్చి మేతను ఇచ్చే పశుగ్రాసాలు ...30
- రైతులను ఆదుకోవడమే ఏపిమాస్ లక్ష్యం ...34

**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆవహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

సానుకూల వైఖరి అంటే కేవలం ఆశాభావమే కాదు, జరిగేదంతా మంచికే అనే వివేచన

# ఏపిమాస్ భాగస్వామ్యంలో కోవిడ్‌పై సంఘటిత పోరాటం

ఎస్ ప్రహల్లాద

"చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునేదానికన్నా కాలకుండా జాగ్రత్త వహించడం మంచిది" అనేది పాత సామెతే అయినా కోవిడ్ విషయములో ఆ సామెత వాస్తవమని నిరూపితమైనది. కోవిడ్ మొదటి దశలో ఒక వైపు ప్రభుత్వం మరోవైపు ప్రజలు చాలా జాగ్రత్త వహించారు కావున కరోనా సోకినా కూడా అంత పెద్దగా ప్రాణ నష్టం జరగలేదు. అయితే, ఆ తర్వాత ప్రజలు మనకెం కాదులే అని చాలా సాదాసీదాగా తీసుకోవడం వలన రెండవ దశలో ప్రాణ నష్టం ఎక్కువగా వుంది. సకాలంలో ప్రభుత్వ యంత్రాంగం స్పందించడం, తగు చర్యలు చేపట్టుట వలన ప్రస్తుతం కోవిడ్ నియంత్రణలోకి వచ్చిందనే చెప్పాలి. అయితే రెండవ దశలో సంభవించిన పరిణామాలను పరిశీలించినట్లయితే కోవిడ్ వచ్చిన వారు ఆదిలోనే గుర్తించి తగు వైద్యం తీసుకోవడం వలన తక్కువ వైద్య ఖర్చుతో బయట పడగలిగారు. కాని కోవిడ్ ఏమి చేస్తుందిలే అని అతి ధీమాతో కొంతమంది, ప్రారంభ దశలో గుర్తించకపోవడం వలన మరికొంతమంది కోవిడ్ బారినపడ్డారు. ఫలితంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, ఇతర అనేక విధాలుగా బాగా చితికిపోయాయి.

**మన ముందున్న కర్తవ్యం ఏమిటి?**

ఒకవైపు ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించి వాటిని పాటిస్తే కరోనాను అరికట్టవచ్చునని పదేపదే చెబుతున్నా, మరోవైపు స్వచ్ఛంద సేవా సంస్థలు ఎంతో అవగాహన కలిగిస్తున్నప్పటికి అనేకమంది పెడచెవిన పెడుతున్నారు. ఉదాహరణకు ప్రభుత్వం తమ గ్రామస్థాయి కార్యకర్తల ద్వారా, స్వచ్ఛంద సంస్థలు తమ సిబ్బంది ద్వారా ఇంటింటికీ మాస్కులు పంపిణీ చేసి వాటిని ధరించమని చెబితే అనేకమంది పట్టించుకోవడం లేదు. ఇంకొంతమంది ధరించినా ముక్కును, నోటిని సరిగా కప్పకుండా కేవలం గడ్డానికి మాత్రమే వేసుకుంటున్నారు. అంటే, ప్రభుత్వాలు లేదా స్వచ్ఛంద సంస్థలు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రానంతవరకు ఆ కార్యక్రమాలు సత్ఫలితాలను ఇవ్వలేవు. అందువల్ల సామాజికంగా ఒత్తిడి పెరిగి, కోవిడ్ దుష్పరిణామాలను తెలుసుకొని తగు జాగ్రత్తలు పాటించితే తప్ప కోవిడ్ నియంత్రణ సాధ్యంకాదు.

**చతుర్ముఖ వ్యూహం**

ఈ నేపథ్యంలో ఏపిమాస్ సంస్థ తన నిర్దిష్ట కార్యక్రమమైన రైతు సంస్థలను బలోపేతం చేసే కృషిని కొనసాగిస్తూనే, కోవిడ్ నియంత్రణపై ప్రజలను చైతన్యవంతులను చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలను ఒక వేదికపైకి తీసుకుని వచ్చి, వారి భాగస్వామ్యంతో కోవిడ్‌పై సమర శంఖం పూరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున చతుర్ముఖ వ్యూహాన్ని (ఎస్ ఎం ఎస్ వి) అమలు చేస్తున్నది.

**చతుర్ముఖ వ్యూహం తీరుతెన్ను ....**

మొదటి వ్యూహం : ఇంటి నుండి బయటకు వెళ్ళి వచ్చే ప్రతి ఒక్కరు తిరిగివచ్చిన వెంటనే తమ చేతులను శుభ్రంగా సబ్బుతో లేదా శానిటైజెర్‌తో కడుక్కోవడం.

రెండవ వ్యూహం : ఇంటి నుండి బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా ముక్కు, నోరు కప్పి వుండేలా ముఖానికి మాస్క్ ధరించడం

మూడవ వ్యూహం : బయటకు తిరిగేటప్పుడు సామాజిక దూరం పాటించడం

నాలుగవ వ్యూహం: ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రతి ఒక్కరు తప్పనిసరిగా కోవిడ్ నియంత్రణ టీకాలు వేయించుకోవడం.

కోవిడ్ నియంత్రణ టీకాలు వేయించుకున్నపుడు కొంతమందికి కొద్దిపాటి జ్వరం రావచ్చు. ఇందువల్ల చాలామంది భయపడి టీకాలు వేయించుకోవడం లేదు. ఇప్పటివరకు వచ్చిన అధ్యయనాల ప్రకారం కోవిడ్ టీకాలు వేయించుకున్న వారికి కోవిడ్ వచ్చినప్పటికీ, దాని ప్రభావం

# ఎఫ్ పి ఓ లను బలోపేతం చేయాలి : కలెక్టర్

**జి**ల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఎఫ్ పి ఓ లను) బలోపేతం చేయాలని అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ సంబంధిత అధికారులను, ఎన్ జి ఓ లను ఆదేశించారు. ఇటీవల ఎఫ్ పి ఓలపై నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని రైతు ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం వుందన్నారు. జిల్లాలో సుమారు 300 రైతు ఉత్పత్తి సంస్థలు ఉన్నాయన్నారు. అందులో కొన్ని మాత్రమే చురుగ్గా పని చేస్తున్నాయన్నారు. మిగిలినవి కూడా చురుగ్గా పని చేయలేక పోవడానికి గల కారణాలను విశ్లేషించి, వారు ఏఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో వాటిని గుర్తించాలన్నారు.

ఇందుకు సంబంధించిన వ్యవసాయ, ఉద్యాన, నాబార్డు శాఖలు సంయుక్తంగా జిల్లాలోని ఎఫ్ పి ఓలు ఉత్పత్తి చేస్తున్న పంటలు, వాటి వివరాలు, అవి ఏ రంగాలలో వెనుకబడి ఉన్నాయో వాటి వివరాలను సేకరించాలన్నారు. వాటి ఆధారంగా వారికి తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. రైతులలో కష్టపడి పని చేసేవారిని ఆ సంస్థలలో సభ్యులుగా ఉండేలా చూడాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు చేసిన తర్వాత వారు సాధారణంగా ఎదుర్కొనే సమస్యలను గుర్తించి వివిధ ప్రభుత్వశాఖల ద్వారా సహాయ సహకారాలు అందించాలన్నారు.

మహిళా అభివృద్ధి సొసైటీ సిఈఓ సిఎస్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రైతు సహకార సంఘాల గురించి, ఎఫ్పిఓ ల గురించి, అవి ఎదుర్కొంటున్న ఒడిదుడుకుల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ద్వారా రైతుల్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రభుత్వపరంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మరికొన్ని ఎన్జీవోలు కూడా తమ ఎఫ్ పి ఓల విజయాలు, సవాళ్ళ గురించి వివరించారు.

జాయింట్ కలెక్టర్ నిశాంత్ మాట్లాడుతూ ప్రతి హార్టికల్చర్ అధికారి, వ్యవసాయశాఖ అధికారులు వారి పరిధిలో మూడు ఎఫ్ పి ఓలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ ఏజీఎం ఉషా మధుసూధన్, ఆర్డీటీ ఎకాలజీ సెంటర్ డైరక్టర్ డాక్టర్ మల్లారెడ్డి అగ్రికల్చర్ జెడి రామకృష్ణ, ఉద్యానశాఖ ఏడి సతీష్, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు భానుజ, క్రిష్టఫర్ రామ్మూర్తినాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ■

---

అంత తీవ్రంగా వుండడంలేదని తెలుస్తున్నది.

కోవిడ్ రెండవ దశలో అనేక మరణాలు సంభవించి నప్పటికీ కోవిడ్ టీకా వేయించుకున్నవారిలో ఎవరూ కోవిడ్ వల్ల మరణించలేదని తాము జరిపిన అధ్యయనంలో తేలిందని అపోలో ఆసుపత్రి వారు తెలియజేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ కోవిడ్ టీకాలు వేయించుకోవడం ఎంతైనా మంచిది.

**నిరంతర అవగాహన సమావేశాలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇతర స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఏపిమాస్ కోవిడ్ నివారణ చర్యలపై అనేక కార్యక్రమాలు చేపడుతున్నది.

చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం ఏపిమాస్ పని చేస్తున్న 14 మండలాలలో గ్రామస్థాయిలో చేపట్టే ప్రతి కార్యక్రమం లోనూ కోవిడ్‌పై అవగాహన కలిగించే బ్యానర్‌ను పెట్టి, పైన తెలిపిన చతుర్ముఖ వ్యూహాన్ని వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి కృషి చేస్తున్నది. ఇదే రీతిలో ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా వారి కార్య క్షేత్రాలలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నాయి.

ఈ చైతన్య కార్యక్రమాలు ఫలించి, ప్రజలలో కోవిడ్ నివారణ చర్యలపై అవగాహన పెంపొంది, వాటిని పాటిస్తూ కోవిడ్ మహమ్మారిని శాశ్వతంగా పారద్రోలుతామని ఆశిద్దాం. ■

పదవి, అధికారం, సంపద శాశ్వతం కావు; చక్కని వ్యక్తిత్వం, వివేకం మనిషిని చిరంజీవిని చేస్తాయి

# చేయూత... అభివృద్ధి ఘనత !

## మాస్ సహకారం ... వ్యవసాయంలో రాణిస్తున్న మహిళలు

రైతుల, ముఖ్యంగా మహిళా రైతుల అభ్యున్నతికి ఏపిమాస్ చేపడుతున్న కార్యక్రమాల గురించి, అండగా నిలుస్తున్న తీరు గురించి, అందిస్తున్న సేవల గురించి 'ఈనాడు' పత్రిక ఒక ప్రత్యేక వ్యాసాన్ని ప్రచురించింది. చిత్తూరు జిల్లా మదనపల్లి విలేకరి పొందుపరచిన ఆ వ్యాసాన్ని 'మహిళా సాధికారత ' పాఠకులకోసం యథాతథంగా అందిస్తున్నాం.

రైతులతో పాటు మహిళలకు వ్యవసాయంలో ప్రోత్సాహం అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలా ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది... ఏపీమాస్ సంస్థ. 2001లో కలిగిరికి చెందిన టి.చంద్రశేఖర్ రెడ్డి స్వయం సహాయక ఉద్యమ నిర్మాణం ప్రధానాంశంగా ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ (ఏపీమాస్) ని ఏర్పాటు చేశారు. సంస్థలో ప్రస్తుతం 10 వేల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉండగా వారిలో 4,500 మంది మహిళా రైతులు ఉన్నారు.



వీరంతా పాడి, వ్యవసాయంపై ఆధారపడినవారు.

గ్రామ సంఘాలు, మండల, జిల్లా స్థాయిలో సమాఖ్యలు ఏర్పాటు చేసి వాటి బలోపేతానికి వివిధ స్థాయిల్లో సిబ్బందిని నియమించి రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తోంది. గిట్టుబాటు ధరలు అందక వ్యవసాయాన్ని మానేసి వేరే పనులకు వెళ్తున్న వారికి అండగా నిలబడి వారిని హరిత వినూత కేంద్రం పథకం ద్వారా సహకారం అందిస్తోంది. ఇందుకోసం 2016లో రైతు సమృద్ధి సేవా కేంద్రాలను ప్రారంభించారు. జిల్లాలోని 14 మండలాల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మదనపల్లె, నిమ్మనపల్లె, కలికిరి, పలమనేరు, వి.కోట, వాల్మీకిపురం, కురబలకోట మండలాల్లో హరిత వినూత్న కేంద్రాల ద్వారా ఎరువులు, క్యాటిల్ ఫీడ్, చాప్ కట్టర్స్, టార్పాలిన్ పట్టలు, టమాటను విక్రయించడం ద్వారా అధిక లాభాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఇందులో నిమ్మనపల్లె ప్రథమ స్థానంలో ఉంది.

**సభ్యులకు లాభాల పంపిణీ**

ఏపీమాస్ సంస్థ ఆధ్వర్యంలో సమాఖ్యలు ఏర్పాటు చేసి అందులో 100 నుంచి 200 మంది వరకు సభ్యులుగా చేర్చుకుంటున్నారు. ఒక్కో మహిళ నుంచి 1000 రూపాయల వరకు వసూలు చేసి ఆ డబ్బుతో సంస్థల నుంచి నేరుగా దాణా, వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేస్తారు. వీటిని గ్రామాల్లో రైతులకు విక్రయించి వాటి ద్వారా వచ్చే లాభాలను సభ్యులందరికీ పంచుతారు.

**కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు**

పశ్చిమ మండలాల్లో రైతులు టమాట ఎక్కువ పండిస్తారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించడం, పండించిన కాయలను సంస్థ కొనుగోలు చేసి ప్రాసెసింగ్ యూనిట్లకు పంపుతోంది. ప్రస్తుతం



సభ్యులు పండించిన టమోటా

(మిగతా 17వ పేజీలో)

# రైతులకోసం ఐదు ముఖ్య పథకాలు !

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. వ్యవసాయానికి సంబంధించి రైతులకు సమాచారం అందించడానికి, ప్రభుత్వ సహాయం అందించడానికి, పంటల దిగుబడిని పెంచడానికి వివిధ కార్యక్రమాలు, పథకాలకు రూపకల్పన చేస్తోంది. ఇప్పటికే అనేక పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఈ పథకాల ద్వారా రైతులు అనేక విధాలుగా సహాయం పొందుతున్నారు. డీబీటీ, కిసాన్ సమ్మాన్ నిధి, జన్‌ధన్ వంటి పథకాల ప్రకారం.. రైతులు నేరుగా లబ్ధి పొందుతున్నారు. దళారుల వ్యవస్థ లేకుండా రైతుల ఖాతాల్లోనే నగదు జమ చేస్తోంది ప్రభుత్వం.

సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వేపతో తయారు చేసిన యూరియా రైతులకు నేరుగా అందించేందుకు ఒక పథకం.. సాయిల్ హెల్త్ కార్డ్ ద్వారా మట్టి నాణ్యత తనిఖీ చేయడం, పంటల దిగుబడి పెంచేందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేయడం, పంటల బీమా పథకం ద్వారా రైతులకు రక్షణ కల్పించడం వంటి పథకాలను అందిస్తోంది. రైతుల సంక్షేమం కోరి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 5 ముఖ్యమైన పథకాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

**1) కిసాన్ సమ్మాన్ నిధి పథకం..**




ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి భారత ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన పథకాల్లో ఇది ఒకటి. ఈ పథకం కింద 2 హెక్టార్ల (4.9 ఎకరాలు) కంటే తక్కువ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పథకం కింద, రైతులందరూ కనీస ఆదాయ మద్దతుగా సంవత్సరానికి 6 వేల రూపాయలు పొందుతున్నారు. 2018, డిసెంబర్ 1వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీనిని రైతులకు ఒక వరంగా పేర్కొంటున్నారు. ఈ పథకం కింద అర్హులైన రైతులకు సంవత్సరానికి 6 వేల రూపాయలు.. మూడు వాయిదాలలో చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు.

**2) డీబీటీ పోర్టల్ పథకం..**

డీబీటీ పోర్టల్, డీబీటీ కృషి యంత్ర యోజన పథకాలను భారత ప్రభుత్వం రైతుల కోసం ప్రారంభించింది. ఇందులో భాగంగా దేశంలోని రైతులు వ్యవసాయ యంత్రాలను తక్కువ ధరలకే పొందవచ్చు. ఈ పథకం కింద రైతుల ఆర్థిక స్థితిని




బలోపేతం చేయడానికి, వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తుంది. వ్యవసాయ యంత్రాలపై భారీ ఎత్తున రాయితీలు ఇస్తుంది. ఈ పథకంలోనూ రైతుల ఖాతాకు నేరుగా డబ్బులు బదిలీ చేయడం జరుగుతుంది. దీనివల్ల రైతుల సబ్సిడీ ఏ మధ్యవర్తికి చేరకుండా నేరుగా వారికే ప్రయోజనం చేకూరుతుంది. ఈ పథకం ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితిలో మార్పులు కనిపిస్తోంది.

**3) ఈ-నామ్ పోర్టల్..**

నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఇ-నామ్) అనేది పాన్-ఇండియా ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ పోర్టల్. ఇది వ్యవసాయ సంబంధిత ఉత్పత్తుల కోసం ఏకీకృత జాతీయ మార్కెట్‌ను సృష్టించడానికి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పోర్టల్




ద్వారా దేశంలోని రైతులు తమ పంటలను ఎక్కడైనా విక్రయించవచ్చు. ఇందులో మొత్తం ఆన్‌లైన్ విధానమే ఉంటుంది. ట్రాన్సాక్షన్స్ కూడా ఆన్‌లోనే జరుగుతాయి.

ఉత్తమమైనదాని కోసం వెంపర్లాడడం కాదు, అందినదానిని అత్యుత్తమంగా మలచుకోవడం నేర్చుకో!

ఉత్తరప్రదేశ్ (66), మధ్యప్రదేశ్ (58), హర్యానా (54), మహారాష్ట్ర (54), తెలంగాణ (44), గుజరాత్ (40) చొప్పున ఈ ఆరు రాష్ట్రాలు ఇ-నామ్ కింద అత్యధిక సంఖ్యలో మార్కెట్లు కలిగి ఉన్నాయి.

**4) వేప పూతతో తయారు చేసిన యూరియా..**

వేప పూత యూరియాను రైతులకు అందిస్తున్నారు. ఈ యూరియా వల్ల పంటల అవసరానికి అనుగుణంగా నత్రజని పోషకాలు లభ్యమవుతాయి. పంట దిగుబడి కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఎరువులను గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తోంది. 2015, జనవరి 7న భారతప్రభుత్వం 100% వేప పూతతో కూడిన యూరియాను ఉత్పత్తి చేయడానికి ఎరువుల కంపెనీలకు అనుమతులు మంజూరు చేసింది. గతంలో, వేప పూతతో తయారు చేసిన యూరియాను ఎరువుల కర్మాగారం మొత్తం సామర్థ్యంలో 35 శాతం వరకు మాత్రమే అనుమతించేవారు.



**5) సాయిల్ హెల్త్ కార్డు పథకం..**

ఎరువుల వాడకం వలన నేలలో పోషక లోపం పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో నేలలోని పోషకాల లోపాన్ని గుర్తించే లక్ష్యంతో 2014-15 సంవత్సరంలో సాయిల్ హెల్త్ కార్డ్ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.




ఈ పథకం కింద.. రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పథకం అమలు మొదటి దశలో అంటే 2015 నుండి 2017 సంవత్సర వరకు 10.74 కోట్ల కార్డులు జారీ చేశారు. ఆ తరువాత రెండో దశలో 2017-2019 సంవత్సరం వరకు 11.69 కోట్ల కార్డులు పంపిణీ చేశారు. ■

## తెలంగాణాలో 1.15 కోట్ల ఎకరాలకు చేరిన సాగు

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం ఆగస్టు మూడవ వారం నాటికి 1.15 కోట్ల ఎకరాలు దాటింది. సాధారణ విస్తీర్ణం 1.16 కోట్ల ఎకరాలు. వ్యవసాయశాఖ ఈ వివరాలను ప్రకటించింది. పంటలవారీ సాగు వివరాలను ప్రభుత్వానికి అందజేసింది. సాధారణం కన్నా వరి 28, పత్తి 5.6, కంది 4.3, ఆహారధాన్యాలు 7.8 శాతం అదనంగా సాగు చేశారు. అయితే, కీలకమైన నూనెగింజల పంటల సాగు తగ్గింది.

జూన్ 1నుంచి ఆగస్టు 3వ వారం వరకూ సాధారణ వర్షపాతం 549.8 మిల్లీ మీటర్ల (మి.మీ.)కు గాను 644.8 కురిసింది. గతేడాది ఇదే కాలవ్యవధిలో 719.8 మి.మీ.లు పడింది. ఆగస్టు 1నుంచి యిప్పటివరకూ కురవాల్సిన దాని కన్నా 44.27 శాతం తక్కువ వర్షం పడింది. మొత్తం 18 జిల్లాల్లో సాధారణం కన్నా ఎక్కువ వర్షాలు కురిశాయి. రంగారెడ్డి, వనపర్తి, జోగులాంబ గద్వాల, ఖమ్మం జిల్లాల్లో సాగు 75 శాతంలోపే ఉంది. మిగిలిన జిల్లాల్లో సాధారణ స్థాయిలో ఉంది.

**రాష్ట్రంలో పంటల సాగు తీరు (లక్షల ఎకరాల్లో)**

| పంట | వేయాల్సింది | వేసింది |
|---|---|---|
| ఆహారధాన్యాలు | 56.48 | 60.88 |
| పత్తి | 47.60 | 50.28 |
| వరి | 34 | 43.51 |
| పప్పుధాన్యాలు | 11.32 | 10.71 |
| మొక్కజొన్న | 9.89 | 6.06 |
| కంది | 8.56 | 8.93 |
| నూనె గింజలు | 5.92 | 3.74 |
| సోయాచిక్కుడు | 4.50 | 3.48 |
| పెసర | 2.04 | 1.34 |
| జొన్న | 1.18 | 0.57 |

■

# ఏ గేదెను ఎంచుకోవాలి ? ఎలా పోషించాలి?

**మ**న దేశంలో, మన తెలుగు రాష్ట్రాలలో పాలఉత్పత్తి ఎక్కువగా గేదెల ద్వారా జరుగుతుంది.

**గేదె జాతులు**

భారతదేశంలోని గేదె జాతులను 5 గ్రూపులుగా విభజించవచ్చు. అవి ముర్రా గ్రూపు (జాతులు : ముర్రా, నీలిరావి, కుండి); గుజరాత్ గ్రూపు (జాతులు : సూర్తి, మెహసానా, జఫరాబాది); మధ్య భారతదేశపు గ్రూపు (జాతులు: నాగపురి, పందరపురి, మందా, జరంగి, కలహండి, సంబాల్‌పూర్, పర్లాకిమిడి); ఉత్తరప్రదేశ్ గ్రూపు (జాతులు : బాధవారి, తరాయ్); దక్షిణ భారతదేశపు గ్రూపు (జాతులు: తోడ, సౌత్ కెనరా).

మన దేశంలో ముర్రా, గుజరాత్ గ్రూపు జాతులను మాత్రమే పాలకు ఉపయోగిస్తారు. మిగిలిన జాతులు పాలు తక్కువగా ఇస్తాయి. వీనిని ఎక్కువగా పనికి ఉపయోగిస్తారు.

**ముర్రా గేదె :** ఇది పాల ఉత్పత్తికి ప్రసిద్ధి గాంచిన జాతి. దీని జన్మస్థలం రోహ్‌తక్, కర్నాల్, హిస్సార్, జింద్, గుర్గావ్ , పంజాబ్ ప్రాంతం. ముర్రా అంటే గుండ్రని కొమ్ములు కలది అని అర్థం. ఇది నల్లని కాటుక రంగు శరీరంతో, తోక పొడవుగా ఉండి తోక కుచ్చు మాత్రం



తెల్లగా ఉంటుంది. శరీరం పెద్దదిగా, తల కొంచెం చిన్నదిగా, కొమ్ములు బాగా దగ్గరికి వంపు తిరిగి ఉంటాయి. గేదె శరీరపు వెనుక భాగం వెడల్పుగా ఉంటుంది. దున్నపోతు 570 కిలోలు, గేదె 450 కిలోల బరువు కలిగి వుంటాయి. ఒక్కొక్క ఈతకు 1600 నుండి 2300 కిలోల పాలనిస్తాయి. వెన్న 7% ఉంటుంది. మన రాష్ట్రంలో నాటు గేదెలకు ముర్రా జాతి వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసి నాటు పశువుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

**సూర్తి :** వీటి జన్మస్థలం గుజరాత్ రాష్ట్రంలోని కైరా, బరోడా , నదియా జిల్లాలు. ఇవి బాగా నెమ్మదైన మనస్తత్వం కలిగి ఉంటాయి. ఇవి గుజరాత్‌లోని ఆనంద్ కో ఆపరేటివ్ పాల కేంద్రాల్లో పాల ఉత్పత్తికి వాడబడుతున్నాయి. నలుపు లేక గోధుమ రంగులో ఉంటాయి. తల మీద కళ్ళు, తోక కుచ్చు తెల్లగా ఉంటాయి. కొమ్ములు కొంచెం పొడవుగా ఉండి అర్ధచంద్రాకారంగా కింది నుండి పైకి కొంచెం వంపు తిరిగి ఉంటాయి. ఇవి ముర్రా గేదెల కంటే సైజు కొంచెం తక్కువగా ఉంటాయి. బరువు 550-600 కిలోలుంటాయి.

ఒక్కొక్క ఈతకు 1550 నుండి 1700 కిలోల పాలనిస్తాయి. మంచి గేదెలు 2200 నుండి 2500 కిలోల పాలను కూడా ఇస్తాయి. పాలలో వెన్న 8 శాతం.

**మెహసానా :** ఇది ముర్రా, సూర్తి జాతుల సంపర్కం ద్వారా ఏర్పడింది. జన్మస్థలం గుజరాత్‌లోని మెహసానా, సిద్ధపూర్, బీజాపూర్ ప్రాంతాలు.

శరీరం కాటుక నలుపు నుండి గోధుమ రంగుతో కొమ్ములు ముర్రాజాతి కొమ్ముల కన్నా కొంచెం తక్కువ వంకర తిరిగి ఉంటాయి. శరీరం పెద్దదిగా ఉండి కండ్లు పెద్దవిగా పైకి ఉబ్బి ఉంటాయి. మెడ పొడవుగా ఉంటుంది. బొంబాయి నగరంలో బాగా ప్రజాదరణ పొందింది. దున్నలు 500-600 కిలోలు, గేదెలు 400-500 కిలోల బరువు తూగుతాయి. ఒక్కొక్క ఈతకు 1400 కిలోల పాలనిస్తాయి.

**జఫరబాదీ :** జన్మస్థలం గుజరాత్ రాష్ట్రంలోని 'గిర్' అటవీ ప్రాంతం. శరీరం నలుపు రంగుతో కొమ్ములు వెడల్పుగా, మందంగా, పొడవుగా చివర కొంచెం వంపు తిరిగి

ఉంటాయి. కొమ్ములు పైకి రాకుండా కిందికి మెడకు రెండువైపులా పెరిగి పైకి మెలి తిరుగుతాయి. నుదురు ఎత్తుగా ఉంటుంది. ఇవి మన దేశపు జాతులన్నింటిలోను భారీ శరీరం కలిగి ఉంటాయి. దున్నలు 650 కిలోలు, గేదెలు 550 కిలోల బరువుంటాయి. ఒక్కొక్క ఈతకు 1800-2700 కిలోల పాలనిస్తాయి. పాలలో 8% వెన్న ఉంటుంది.

**నాగపురి :** ఇవి నాగపూర్, వార్ధా, హైదరాబాద్, మధ్యప్రదేశ్ , మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కనిపిస్తాయి. వీటిని 'మరట్వాడా' గేదె అని కూడా అంటారు. నలుపురంగు శరీరంతో కొమ్ములు బాగా పొడవుగా వుండి భుజాల వరకు విస్తరించి ఉంటాయి. హైదరాబాద్, మధ్యప్రదేశ్‌లో పాల ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచినవి. ఒక్కొక్క ఈతలో 1000-1100 కిలోల పాలనిస్తాయి. దున్నలు బాగా పని చేస్తాయి.

**అధిక పాల సారగల పాడి గేదె ఎంపిక**

- శారీరక లక్షణాలకు, పాల ఉత్పత్తికి కొంత సంబంధం ఉంది కనుక శారీరక లక్షణాలను బట్టి మంచి పాల సార గల పాడిగేదెను ఎంపిక చేసుకోవాలి.
- మనం ఎన్నుకునే పాడిగేదె దాని జాతి లక్షణాలు కలిగి ఉండాలి.
- తల చిన్నదిగా, దవడలు గట్టిగా, కళ్ళు పెద్దవిగా కాంతివంతంగా వెడల్పాటి నుదురు కలిగి ఆరోగ్యవంతంగా ఉండాలి.
- మెడ సన్నదిగా జబ్బలలో కలిసిపోయి వుండాలి.
- వీపు భాగం సమతలంగా వెడల్పుగా ఉండాలి.
- చర్మం పలుచగా, ప్రక్కటెముకలు ఎడంగా, గజ్జలు లోతుగా ఉండాలి.
- కాళ్ళు నిటారుగా బలంగా కొంచెం ఎడంగా ఉండాలి.
- వెనుక నుండి చూస్తే తొడలు ఎడంగా ఉండి పొదుగుకు ఎక్కువ చోటు ఉండాలి.
- గుండె భాగం లోతుగా, పొడవుగా ఉండాలి.
- పొట్టభాగం పొడవుగా, లోతుగా ఉండి వెనుకకు వెళ్ళే కొలది వెడల్పుగా ఉండాలి.
- గేదెను ముందు నుండి చూసినా లేదా పక్క నుండి



చూసినా శరీరం త్రికోణాకారంలో ఉండాలి.
- పొదుగు పెద్దదిగా, సమతలంగా శరీరానికి అంటి పెట్టుకుని, వెనుకవైపు పై వరకు విస్తరించి ఉండాలి.
- పాలు పితికిన తర్వాత, పితకక ముందు పొదుగు పరిమాణంలో బాగా మార్పు ఉండాలి. పాలు పితికిన తర్వాత పొదుగు పూర్తిగా తగ్గిపోవాలి.
- చన్నులు నాలుగు ఒకే పరిమాణంలో ఉండి పొదుగు మీద చతురస్రాకారంలో అమరి ఉండాలి.
- చన్నుల్లో, పొదుగులో ఎలాంటి గడ్డలు ఉండరాదు.
- చన్నులు బలపం కట్టి వున్నవానిని ఎన్నుకోరాదు. అలా ఉంటే ఆ గేదెకు ముందు ఈతలో పొదుగు వాపు వ్యాధి వచ్చి ఉంటుంది.
- పొదుగు , ఉదరం కింద ఉండే పాల నరం పొడవుగా వంకరలు తిరిగి శాఖలుగా విభజింపబడి ప్రస్ఫుటంగా కనిపించాలి.
- గేదెలు కొనేటపుడు అది ఎప్పుడు ఈనింది, ఎన్నవ ఈతలో ఉంది, ఈనిన తరువాత ఎన్ని నెలలు పాడిలో ఉంది, కట్టినట్లయితే ఎన్ని నెలలు గర్భంలో ఉంది, వట్టిపోయి ఎంతకాలం అయింది , ఈనడానికి ఇంకా ఎంతకాలం పడుతుందనే విషయాలు పరిశీలించాలి.
- సంతలో పశువులకు రంగులు వేయడం, కొమ్ములు చెక్కడం మొదలగునవి గమనించాలి.
- మెయ్య వచ్చేవాటిని, తల్లులకు అలర్జిక్ పొదుగు జబ్బు వచ్చిన వాటిని కొనరాదు.
- ముందు ఈతలో ఈసుకుపోయిన గేదెలను కూడా

**(మిగతా 21వ పేజీలో)**

ఎవరి జీవితమూ పరిపూర్ణం కాదు, కాని ప్రతి క్షణాన్ని మంచిగా జీవించగలిగితే అది సంపూర్ణమే

# అధిక పోషకాలను అందించే చిరుధాన్యాలు

**చి**రుధాన్య పంటల ఆహార వినియోగం మానవాళికి చాలా పురాతన కాలం నుండే తెలియడమే కాక, బహుశ నాగరిక ప్రపంచం మొట్టమొదటిసారిగా సాగులోకి తెచ్చిన పంటలు కూడా చిరుధాన్యాలు అనవచ్చు.

ప్రపంచంలో చిరుధాన్య పంటలు 38 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో సాగుచేయబడుతూ 28 మిలియన్ టన్నుల దిగుబడిని అందిస్తున్నాయి. మన దేశంలో చిరుధాన్యాల సాగు 9 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతూ 9.4 మిలియన్ టన్నుల దిగుబడిని సమకూరుస్తు న్నాయి. విభిన్న వాతావరణ పరిస్థితులలో వివిధ రకాలైన చిరుధాన్య పంటల సాగు చేపడుతున్నారు.



రాజస్థాన్‌లో సజ్జ ఎక్కువ విస్తీర్ణంలో సాగు అవుతుండగా దక్కన్ పీఠ భూమిలో (మరాఠ్వాడా, తెలంగాణ, ఉత్తర కర్ణాటక) లో జొన్న ; దక్షిణ ఆంధ్ర, తమిళ నాడు, ఒడిశా దక్షిణ కర్నాటక ప్రాంతాలలో రాగి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతోంది. ఉత్తరాఖండ్, ఇతరత్రా పర్వత ప్రాంతాలలో ముఖ్యంగా కొర్రలు, వరిగలు, సామలు ఆరికలు సాగు చేస్తుంటారు.

ఇక మన రెండు రాష్ట్రాలలో జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామ, ఆరికలు, వరిగలు చిరుధాన్య పంటలుగా సాగు చేయబడుతున్నాయి. తెలంగాణాలోని రంగారెడ్డి, మహబూబ్ నగర్, అదిలాబాద్ జిల్లాలలో జొన్న, సజ్జ; రాయలసీమలో రాగి, కొర్ర ; ఉత్తర కోస్తా జిల్లాలలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో రాగి, సామ, వరిగలు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

**చిరుధాన్యాలు – జాతీయ ఆహార భద్రత**

ఇటీవల కాలంలో ప్రజల జీవన శైలితో పాటు ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పులు, నవీకరణవైపు మొగ్గు చూపడం, వివిధ ఆహారపదార్థాలలో గల పోషక విలువలపై సరైన అవగాహన లేకపోవడం వలన చిరుధాన్యాల వాడకం గణనీయంగా తగ్గింది. దీని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై ఎంతగానో పడి, ఈ మధ్య కాలంలో మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత జబ్బులు, క్యాన్సర్, పోషక లోపాలతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది.

చిరుధాన్యాల పంటల సాగును లాభసాటిగా చేయటానికి చిరుధాన్యాలతో తయారైన వివిధ విలువ ఆధారిత పదార్థాలను ముఖ్యంగా చపాతీ పిండి, పాపడ్, చిక్కీస్, కేక్స్, బిస్కెట్స్‌ను విరివిగా ప్రజా వినియోగంలోకి తేవాల్సిన అవసరం వుంది. జాతీయ ఆహారధాన్యాల ఉత్పత్తిలో చిరుధాన్య పంటలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

**అధిక పోషక పదార్థాల సమూహం**

చిరుధాన్యాలు ముఖ్యంగా మాంసకృత్తులు, పీచు పదార్థాలు, మినరల్స్‌ను ఎక్కువగా మొత్తంలో కలిగి ఉంటాయి.

- తక్కువ భూసారం, ఉప్పు, చవుడు భూములలో కూడా చిరుధాన్యాల పంటల సాగు చేపట్టవచ్చు.
- చిరుధాన్యాల పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తక్కువ

| చిరుధాన్యాలలో పోషక పదార్థాలు (ప్రతి 100 గ్రాములకు) | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | మాంసకృత్తులు (గ్రా) | పిండిపదార్థాలు (గ్రా) | కొవ్వులు (గ్రా) | మినరల్స్ (గ్రా) | పీచుపదార్థం (గ్రా) | కాల్షియం (మి.గ్రా) | ఫాస్ఫరస్ (మి.గ్రా) | ఐరన్ (మి.గ్రా) | శక్తి (మి.గ్రా) |
| రాగి | 7.3 | 72 | 1.3 | 2.7 | 3.6 | 344 | 283 | 3.9 | 336 |
| జొన్న | 10.4 | 70.7 | 3.1 | 1.2 | 2.0 | 25 | 222 | 5.4 | 329 |
| సజ్జ | 11.8 | 67.0 | 4.8 | 2.2 | 2.3 | 42 | -- | 11.0 | 363 |
| కొర్ర | 12.3 | 60.2 | 4.3 | 4.0 | 6.7 | 31 | 290 | 2.8 | 351 |
| సామలు | 7.7 | 67.0 | 4.7 | 1.7 | 7.6 | 17 | 220 | 9.3 | 329 |
| అరికలు | 8.3 | 65.9 | 1.4 | 2.6 | 5.2 | 35 | 188 | 1.7 | 353 |
| వరిగలు | 12.5 | 70.4 | 1.1 | 1.9 | 5.2 | 8 | 206 | 2.9 | 354 |
| ఊదలు | 6.2 | 65.5 | 4.8 | 3.7 | 13.6 | 22 | 280 | 18.6 | 300 |
| వరి | 6.8 | 78.2 | 0.5 | 0.8 | 1.0 | 33 | 160 | 1.8 | 362 |
| గోధుమ | 11.8 | 7.12 | 1.5 | 1.5 | 2.0 | 30 | 306 | 3.5 | 348 |

- చిరుధాన్య పంటల సాగులో చీడపీడల ఉధృతి తక్కువ
- జీవ వైవిధ్యం, పంటల సరళిలో చిరుధాన్య పంటలకు ఎక్కువ ప్రాముఖ్యత
- వాతావరణ మార్పుల వల్ల కలిగే నీరు, ఆహారకొరత పరిస్థితులలో కూడా చిరుధాన్య పంటలు అధిక ఉష్ణోగ్రతను, వర్షాభావ పరిస్థితులను తట్టుకొని ఆహారభద్రత అందిస్తాయి.
- అయితే, చిరుధాన్య పంటల ఉత్పాదకత, స్థిరత్వం తక్కువ.

**చిరుధాన్య పంటల సాగులో ఉత్పత్తి ప్రతిబంధకాలు**

- చిరుధాన్య పంటల సాగు ఖరీఫ్‌లో ముఖ్యంగా తక్కువ వర్షపాతం గల తేలికపాటి ఎర్ర చెలక లేక గరప నేలలకు మాత్రమే పరిమితమై ఉండడం.
- జొన్న మల్లె (స్ట్రిగా) పరాన్న కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉండటం
- పక్షులద్వారా చివరి దశలో ఎక్కువ పంట నష్టం కావడం
- అధిక దిగుబడిని ఇచ్చే మేలైన రకాలు, హైబ్రీడ్స్ అందుబాటులో లేకపోవడం
- ప్రభుత్వపరంగా పంట రుణాలు, పంట బీమా లేకపోవడం
- పంటల సాగులో సరైన మోతాదులో ఎరువులు, పురుగు మందులు, కూలీల వినియోగం లేకపోవడం
- చిన్న , సన్నకారు రైతుల కమతాలకే చిరుధాన్య పంటల సాగు పరిమితం కావడం
- వర్షాధార సాగులో చెదలు ఆశించి ఎక్కువ పంట నష్టపోవడం
- ప్రధాన పంటగా కాక ఇతర పంటలలో మిశ్రమ పంటగా పండించడం
- బంక కారు తెగలు ఎక్కువగా ఆశించడం

చిరుధాన్య పంటల సాగు విస్తీర్ణాన్ని, సరాసరి దిగుబడిని పెంచడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈమధ్య కాలంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఖేవ్), కింద విరివిగా నిధులను సమకూర్చుతున్నాయి. ఈ పథకం కింద

# ఆరోగ్యాన్ని, బలాన్ని అందించే చిరుధాన్యం రాగులు !

**చి**రుధాన్యాల్లో (మిల్లెట్స్) రాగులను రారాజుగా పేర్కొంటారు. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో రాగులకున్న ఆదరణ ప్రత్యేకమైనది. రాగులను ఆంగ్లంలో ఫింగర్ మిల్లెట్స్ అంటారు. రాగులతో అనేక వంటకాలు తయారు చేసుకుంటారు. రాగులు ఇతర ధాన్యాల కంటే బలవర్ధకమైనవి. రాగులలో అన్ని ఆహారధాన్యాలలో కంటే కాల్షియం అత్యధికస్థాయిలో వుంటుంది. ఇందులో ప్రొటీన్స్, మినరల్స్ ఫైబర్ కూడా అధికంగా లభిస్తాయి. రాగులలో కొవ్వును కలిగించే పదార్థాలు తక్కువగా వుండటమే కాక ఇవి త్వరగా జీర్ణమవుతాయి కూడా. అందువల్ల రాగులను రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకుంటే ఆరోగ్యం మన వెంటే వుంటుంది.

**రాగులతో ఆరోగ్య ప్రయోజనాలు**

**ఎముకల ఆరోగ్యానికి :** రాగులలో కాల్షియం పుష్కలంగా వుండడం వల్ల ఎముకల బలానికి తోడ్పడతాయి. పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడతాయి. వయస్సు పెరుగుతున్నవారికి రాగులు సరైన మోతాదులో కాల్షియాన్ని అందిస్తాయి. మహిళలు ఎముకల పటుత్వానికి రాగులతో

---

చిరుధాన్యాలైన రాగి, కొర్ర, సామ సాగును సన్న, చిన్నకారు రైతుల కమతాలలో విస్తరించడానికి ముఖ్యంగా సూక్ష్మ పోషకాలపై పురుగు, కలుపు నివారణ పద్ధతులపై క్షేత్ర ప్రదర్శనలను చేపడుతున్నారు.

**ప్రోత్సాహకాలు**

- చిరుధాన్యాలు గ్రామాలలో సహజసిద్ధంగా నిల్వ ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేయడం.
- మద్దతు ధర ప్రకటించడం
- ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చి ఆహారభద్రతతో పాటు, గ్రామీణ పేద ప్రజలలో పోషక లోపాలు నివారించడం.
- సన్న, చిన్నకారు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం
- మేలైన వంగడాలతో పాటు, శాస్త్రీయ సాగు పద్ధతులపై క్షేత్రస్థాయిలో ప్రచారం
- చిరుధాన్యాల సాగు వల్ల ఒనగూరే జీవవైవిధ్యం, సమతుల్య వనరుల వినియోగానికి రైతులకు బోనస్ ధర ప్రకటించడం
- అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా, వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఆహార వినియోగంలో చిరుధాన్యాలపై గల అపోహలను తొలగించి వీటిలో గల పోషక పదార్థాలపై ప్రజలలో సరైన అవగాహన కల్పించడం.

చిరుధాన్య పంటల ప్రాధాన్యతను గుర్తించి ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చి మద్దతు ధరను ప్రకటించినట్లయితే ఈ పంటల సాగు విస్తీర్ణం దానంతట అదే పెరిగి రైతులకు లాభాలతో పాటు జాతీయ ఆహార భద్రతకు సహకరించడానికి అవకాశం ఉంది.

కనుక తక్షణమే ప్రభుత్వం చిరుధాన్య పంటల సాగు గ్రామీణ ప్రాంతాలలో వివిధ ప్రభుత్వ పథకాలతో (వాటర్‌షెడ్, ఎన్‌ఆర్‌ఇజిఎ మొదలైనవి) అనుసంధానించి సన్న చిన్నకారు రైతు కమతాలలో చిరుధాన్యాల సాగు ప్రోత్సహించడమే కాక ధాన్యం కొనుగోలుకు, స్థానికంగా నిల్వ చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలి.

ఇంతేకాకుండా చిరుధాన్యాలతో తయారైన వివిధ విలువ ఆధారిత పదార్థాలను సమగ్ర శిశు అభివృద్ధి (సిడిఎస్), మధ్యాహ్న భోజనంలో అందజేయడం (మిడ్ డే మీల్), సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో ఆహారం లో కలిపి ఇచ్చినట్లయితే చిన్న, పెరిగే పిల్లల్లో పౌష్టిక ఆహార లోపాలను నివారించడమే కాక దారిద్ర్యరేఖకు దిగువన వుండే ప్రజలకు ఆహారం, పోషక భద్రత కల్పించినవారమవుతాం. ■

జీవితమనే నాణానికి ఒకవైపు ఆనందం మరోవైపు అవేదన; ఒక్కటేకాదు రెండూ వుంటాయని మరచిపోకు

తయారుచేసిన రాగి మాల్ట్ తాగడం మంచిది.

**మధుమేహానికి :** మధుమేహ వ్యాధికి రాగులతో చేసిన ఆహారపదార్థాలు, రాగి గంజి, పాలల్లో కలిపిన రాగుల పానీయం చక్కటి ఔషధంగా పని చేస్తుంది. రాగులలోని ఫైటో కెమికల్స్ మధుమేహవ్యాధిగ్రస్తుల్లో చక్కెర స్థాయిని నియంత్రించడానికి సహాయపడుతుంది.

**హైకొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గించడానికి :** రాగులు అమినో యాసిడ్ లెసిథిన్, మేథినోన్ కలిగి వుండి, కాలేయంలోని అదనపు కొవ్వు తొలగించడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయి తక్కువ చేయడానికి సహాయపడతాయి.

**రక్తహీనత :** సహజసిద్ధమైన ఆరోగ్యాన్ని అందించడానికి రాగులు బాగా ఉపయోగపడతాయి. రాగులు తరచుగా తీసుకోవడం వల్ల రక్తహీనతను (అనీమియా) అరికట్టవచ్చు.

**వయస్సును తగ్గించడానికి :** చిరుధాన్యాలలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటివల్ల వయస్సు తక్కువగా కనపడుతూ ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. రాగులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పోషకాహార లోపం, ప్రమాదకరమైన వ్యాధులు వంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చు.

**బీపీని కంట్రోల్ చేస్తుంది :** హై బ్లడ్ ప్రెజర్‌తో బాధపడేవాళ్ళు, కరోనరీ వ్యాధులతో బాధపడేవాళ్ళు పీచుపదార్థాలు అధికంగా ఉన్న రాగులు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. రోస్ట్ చేసిన రాగులను తీసుకోవడం వల్ల అధిక రక్తపోటుతో బాధపడేవారికి టానిక్‌లా పని చేస్తుంది.

**గుండె ఆరోగ్యానికి :** కాలేయ వ్యాధులు, గుండె బలహీనత, ఉబ్బసం వంటి ఆరోగ్య సమస్యలు దరి చేరకుండా ఉండాలంటే రోజువారీ ఆహారంలో రాగులను తప్పనిసరిగా తీసుకోవాలి. వృద్ధాప్యంలో వున్నవారు రాగులతో తయారుచేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరానికి బలం, శక్తి అందుతాయి.

**మూత్రపిండాలలో రాళ్ళు :** మూత్రపిండాలలో (కిడ్నీల్లో) రాళ్ళు ఏర్పడకుండా నిరోధించే శక్తి రాగులకు ఉంది. వీరి రాగులతో తయారుచేసిన ఆహారం తీసుకుంటే మంచిది.



రాగులు కడుపులో మంటను తగ్గించి చలువ చేస్తాయి.

**బరువు తగ్గడానికి**

రాగుల్లో అమినో యాసిడ్స్, ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం ఉంటాయి. ఇవి ఆకలిని తగ్గిస్తాయి కాబట్టి బరువు నియంత్రణకు సహాయపడుతుంది. రాగిపిండితో తయారు చేసిన ఆహారాల పదార్థాలు తీసుకోవడం వల్ల క్యాలరీలు ఎక్కువకాకుండా చూస్తుంది. రాగుల్లో పీచుపదార్థం అధికంగా ఉండడం వల్ల కడుపు నిండినట్లు అనిపించి ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది.

**రాగులలోని పోషక విలువలు** (100 గ్రాములకు)

| **పోషకాలు** | **విలువలు** |
|---|---|
| ప్రొటీన్స్ | 7.3 గ్రాములు |
| మినరల్స్ | 2.7 గ్రాములు |
| పీచు పదార్థాలు | 3.6 గ్రాములు |
| పిండి పదార్థాలు | 72 గ్రాములు |
| కాల్షియం | 344 మిల్లీ గ్రాములు |
| ఇనుము | 3.9 మిల్లీ గ్రాములు |

**రాగులతో వంటకాలు**

సాధారణంగా రాగి పిండితో అంబలి, సంకటి, దోశ, రొట్టె, ఇడ్లీ వంటి పదార్థాలు తయారుచేసుకుంటారు. రాగులతో చేసిన మాల్ట్ వేసవికాలంలో తీసుకుంటే శరీరానికి చలువచేసి వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది. రాగులతో చిన్నపిల్ల పోషణకు అనువైన ఆహారపదార్థాలను (బేబీఫుడ్స్) కూడా తయారుచేసుకోవచ్చు. ఇవేకాకుండా రాగులతో మురుకులు, లడ్డూలు, బిస్కెట్లు, బ్రెడ్, మల్టీగ్రెయిన్ ఆటాతో చపాతి, సేమ్యా వంటి రుచికరమైన పదార్థాలను తయారుచేసుకోవచ్చు. ఇలా రాగులను మనరోజు వారీ ఆహారంలో తీసుకుంటే ఆరోగ్య సమస్యల నుండి, పోషకాహార లోపాల నుండి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని పెంపొందించుకొనవచ్చు. ■

# గ్రామీణ రైతులే వ్యవసాయ యంత్రాల ఆవిష్కర్తలు!

**క**రోనా నేపథ్యంలో పట్టణాలనుంచి స్వగ్రామాలకు తిరిగి వచ్చి వ్యవసాయం కొనసాగిస్తున్న కొందరు రైతులు సృజనాత్మక ఆలోచనలతో తమకు అవసరమైన వ్యవసాయ పరికరాలను, యంత్రాలను రూపొందించుకొని వాడుకుంటున్నారు. ఈ రైతు ఆవిష్కర్తల్లో కొందరు నేలతల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌లో సభ్యులు కావటం విశేషం. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామం కేంద్రంగా ఇది పని చేస్తున్నది. కష్టకాలంలో సులువుగా, తక్కువ కూలీలతో పనులు చేసుకునే ఆవిష్కరణలు చేసిన వీరికి 'వాటర్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్' సంస్థ ఆర్థిక తోడ్పాటును అందించి ప్రోత్సహించింది.



**గుంటక :** కలుపు నిర్మూలనతో పాటు ఎరువు వేయడానికి ఉపయోగకరం.



**దంతె :** దుక్కి చేయటంతోపాటు విత్తనం, ఎరువు వేయడానికి ఉపయోగపడుతుంది. పది వేల రూపాయల ఖర్చుతో వీటిని రూపొందించిన రైతు పేరు రుద్రపాక నరసింహ. అతనిది సంస్థాన్ నారాయణపూర్ మండలం సర్వేల్ గ్రామం.



**గడ్డి ఏరే పరికరం:** వరి పంటను యంత్రంతో కోయించిన తర్వాత చెల్లాచెదురుగా పడిన గడ్డిని పోగెయ్యటం ఖర్చుతో కూడిన పని. అందువల్ల కొందరు రైతులు గడ్డికి నిప్పు పెడుతున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతినటమే కాకుండా గాలి కలుషితమవుతోంది. ఈ పరికరంతో తక్కువ సమయంలో గడ్డిని కుప్ప వేయవచ్చు. రూ.700 ఖర్చుతో దీన్ని రూపొందించిన రైతు వంకా శ్యాంసుందర్‌రెడ్డి. ఇతనిది



జనగాం జిల్లా లింగాల ఘనపురం మండలంలోని వనపర్తి.

**చేతక్ వీడర్ :** పాత ఇనుప సామాను షాపులో చేతక్ స్కూటర్ విడిభాగాలు తీసుకొని అనేక పనులు చేసేలా రూ. 30 వేల ఖర్చుతో రూపొందించిన రైతు బొల్లం శ్రీనివాస్. ఇతనిది లింగాల ఘనపూర్ మండలం వనపర్తి. గేర్ బాక్స్ కూడా ఉండటంతో ఇది సమర్థవంతంగా పని

చేస్తోంది. దుక్కికి, విత్తనాలు వేసుకోవడానికి, కలుపు నిర్మూలించడానికి గుంటక / దంతె మాదిరిగా, బెడ్ మేకర్‌గా, పంపును అనుసంధానం చేసి కాలువ నుంచి నీళ్లు తోడటానికి కూడా ఉపయోగిస్తున్నారు.



**ట్రాలీ స్ప్రేయర్ :** పురుగుమందులు, కషాయాలు, జీవామృతం వంటి ద్రావణాలను పంటలపై తక్కువ శ్రమతో, తక్కువ ఖర్చు పిచికారీ చేయడానికి ఇది ఉపయోగ పడుతోంది. ట్యాంకును మోయటం కన్నా ట్రాలీపై పెట్టుకొని పిచికారీ చేసుకోవచ్చు. మనిషి తన వెనుక ఈ ట్రాలీని పెట్టుకొని.. దీన్ని లాక్కుంటూ ముందుకు వెళ్తూ ఉంటే చాలు.



బొల్లం శ్రీనివాస్ ఈ ట్రాలీని రూ. 2,100 ఖర్చుతో తయారు చేసి, ట్యాంకర్‌ను దానిపై అమర్చాడు.

చేతక్ వీడర్ నడుపుతున్న రైతు బొల్లం శ్రీనివాస్ ■

## వరి, మొక్కజొన్న పంటలకు పురుగుల నివారణ

**వరిని ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఆశిస్తాయి.** ప్రస్తుతం నారుమడులు మరియు పిలకదశలో వున్న వరి పంటలో ఆకుముడుత మరియు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణగా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి.

**మొక్కజొన్న**

**కత్తెర పురుగు :** ప్రస్తుతం జొన్న మరియు మొక్కజొన్నలో కత్తెరపురుగు ఆశించే అవకాశం ఉన్నందున ఫిరమోన్ ఎరలు ఎకరాకు 10 చొప్పున అమర్చుకుని బుట్టకు 10 పురుగులు కనిపించిన వెంటనే నివారణగా బాల్యదశలో ఉన్న మొక్కలపై మొదటి మరియు 2వ దశ లార్వాల నివారణగా వేప నూనె 5 మి.లీ./లీ. నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. 3వమరియు 4వ దశ లార్వాల నివారణగా థయోడికార్బ్ 2 గ్రా/లీ. నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. ■

## చేయూత... అభివృద్ధి ఘనత !

(7 వ పేజీ తరువాయి)

మదనపల్లెలో 20 టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ స్టోరేజీని కూడా ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం కోసం కురబలకోట, వాల్మీకిపురాన్ని ఎంపిక చేసి ఆ ప్రాంతంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**ఏడాదిలో 10 లక్షల రూపాయల టర్నోవర్**

సంస్థ ద్వారా దుకాణం ఏర్పాటు చేశా. ఇందులో పశువుల దాణాతోపాటు ఎర్రగడ్డలు, కూరగాయలు విక్ర యిస్తున్నా. రైతుల నుంచి టమాట కొనుగోలుచేసి పరిశ్రమ లకు ఎగుమతి చేస్తున్నాం. నెల రోజుల్లోనే రూ. 6 లక్షల విలువ చేసే ఎగుమతి చేశాం. సమాఖ్యలో 500 మంది సభ్యులున్నారు. ఒక్క పాడి ఆవు ఉన్న రైతుకు ఏడాదికి ఫీడ్ ద్వారా బయట ధరతో పోల్చుకుంటే 2 వేల రూపాయల వరకు మిగులుతోంది. ఈ ఏడాది రూ. 10 లక్షల వరకు టర్నోవర్ చేయగలిగాం.

– శిరీష, రైతు, ఏపీమాస్ సభ్యురాలు ■

# కరోనా కల్లోలంలో బాలకేంద్రం కళార్చన !

**జ**వహర్ బాల కేంద్రం'... పని చేసేది మూడు గంటలే. కానీ ఆమెకు రోజంతా అదే పని. లలిత కళలు బాలల మనోవికాసానికి బాటలు వేసి... వారిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దుతాయనేది ఆమె నిశ్చితాభిప్రాయం. అందుకే కరోనా సమయంలోనూ పిల్లలను వాటికి దూరం కానివ్వలేదు. రాష్ట్రంలోనే తొలిసారిగా 'బాల కేంద్రం' ద్వారా ఆన్‌లైన్ శిక్షణను తీసుకువచ్చి... ఎంతోమంది చిన్నారులను కళల వైపు ప్రోత్సహిస్తున్న సూర్యాపేట జిల్లా 'బాల కేంద్రం' సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి ఆంధ్రజ్యోతి 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.ఆ పత్రిక సౌజన్యంతో 'మహిళా సాధికారత' పాఠకులకు ఆ విశేషాలు అందిస్తున్నాం.



*బాల కేంద్రం సూపరింటెండెంట్*
*బండి రాధాకృష్ణారెడ్డి*

గత ఏడాది కరోనా విజృంభించినప్పుడు అందరం ఇళ్లల్లోనే బందీలైపోయాం. పెద్దలకు ఆఫీసులు లేవు. పిల్లలకు స్కూళ్లు లేవు. మనమైతే పరిస్థితిని అర్థం చేసుకోగలం. మరి పిల్లల మాటేమిటి? ఒక్కసారిగా నాలుగు గోడల మధ్యే రోజంతా గడపాలంటే ఎంత కష్టం? అది వారిని మానసికంగా ఎంతో కుంగదీస్తుంది. బడికి వెళితే చదువుతో పాటు ఆటలుంటాయి. తోటి విద్యార్థులుంటారు. వీటన్నిటికీ దూరంగా... ఎటూ కదలనీయకుండా నెలలకు నెలలు కట్టేసినట్టు పడేస్తే భవిష్యత్తులో ఆ ప్రభావం పిల్లలపై తీవ్రంగా ఉంటుంది. ఇవన్నీ ఆలోచించాక వాళ్లను ఈ ఖాళీ సమయంలో ఫైన్ ఆర్ట్స్ (లలిత కళలు) వైపు తిప్పితే బాగుంటుందనిపించింది. ఎలా? విద్యా బోధనకైతే ఆన్‌లైన్ తరగతులు జరుగుతున్నాయి. అదే తరహాలో నాట్యం, సంగీతం, డ్రాయింగ్ వంటి కళలు నేర్పిస్తే?

**ఆ మాట చెప్పగానే...**

బాల కేంద్రం' తొలి ప్రాధాన్యం పేద పిల్లలకు కళలను పరిచయం చేయడం. బయట ప్రైవేట్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఒక డ్యాన్స్ క్లాస్‌కు వెళ్లాలంటే వందల రూపాయలు చార్జ్ చేస్తారు. అదే 'బాల కేంద్రం'లో అయితే ఏడాదికి యాభై రూపాయలకు మించదు. కరోనా వల్ల కేంద్రానికి వచ్చే పిల్లలందరూ ఆసక్తి ఉన్నా కళలకు దూరమయ్యారు. అందుకే ఇంట్లోనే ఉంటూ అభ్యసించేలా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలనుకున్నా. విషయం పై అధికారులకు చెబితే ముందు భయపడ్డారు. 'పాఠాలైతే చెప్పచ్చు. నాట్యం, సంగీతం లాంటివి ఆన్‌లైన్‌లో ఎలా నేర్పగలం? సాధ్యమవుతుందా? అని సందేహం వ్యక్తం చేశారు. ఆ మాట కొస్తే యూట్యూబ్‌లో లక్షల వ్యూస్ ఉన్న ఫైన్‌ఆర్ట్స్ వీడియోలు ఎన్ని లేవు? అలాంటప్పుడు శిక్షణ తీసుకున్న టీచర్లం మేమెందుకు చెప్పలేము? అధికారులకు అదే చెప్పి ఒప్పించాను.

**పక్క రాష్ట్రాల వారు కూడా...**

చివరకు గత ఏడాది జూన్‌లో ప్రయోగాత్మకంగా సూర్యాపేట కేంద్రం నుంచి ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించాం. అనూహ్య స్పందన వచ్చింది. ఈ ఏడాది మార్చిలో ప్రధాన కార్యాలయం నుంచి కూడా ఆదేశాలు వచ్చాయి. మా కేంద్రంలో ఆఫ్‌లైన్‌లో అయితే 800 మంది పిల్లలు ఉండేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో దాదాపు 600 మంది నేర్చుకొంటున్నారు.

ఒక్క తెలంగాణవారే కాదు... ఆంధ్రా, బెంగళూరు, ముంబయి తదితర ప్రాంతాల వారు కూడా అడిగి మరీ తమ పిల్లలను చేర్పించారు. మేం చేస్తున్న ప్రయత్నాన్ని తల్లితండ్రులు, అధికారులు అభినందించారు. ఇది మాకు ఎనలేని ఉత్సాహాన్నిచ్చింది. ప్రస్తుతం ఇక్కడ నాట్యం, కర్ణాటక సంగీతం, చిత్రలేఖనం, కుట్టు, అల్లికలు, తబల,

స్నేహం పేరుతో ఎన్నో ఆశించే వారు ఎందరో, కేవలం స్నేహాన్నే ఆశించే కొందరే నీ నిజమైన స్నేహితులు

మృదంగం, వయోలిన్‌లో శిక్షణనిస్తున్నాం. అంతేకాదు... తల్లితండ్రులు అడిగారని మా దగ్గర లేకపోయినా యోగ, కరాటేలో కూడా తర్ఫీదునిస్తున్నాం. 5 నుంచి 16 సంవత్సరాల లోపు పిల్లలు ఎవరైనా... ఎక్కడివారైనా ఆసక్తి ఉంటే ఆన్‌లైన్ ద్వారా నేర్చుకోవచ్చు. రాష్ట్రంలోని పన్నెండు బాల కేంద్రాల్లో ఈ సౌకర్యం కల్పిస్తున్న కేంద్రం మాదొక్కటే.

**సంస్కారవంతులుగా...**

పిల్లలకు విద్యతో పాటు లలితకళలు కూడా నేర్పిస్తే... ఏకాగ్రత పెరుగుతుంది. శారీరకంగానే కాకుండా మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుంది. ఆ ప్రభావం చదువులోనూ కనిపిస్తుంది. 'డ్యాన్స్ చేస్తే బొమ్మలు గీస్తే ఏమొస్తుంద'ని చాలామంది అంటుంటారు. అయితే మన కళల్లో ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. నాట్యం వల్ల శరీరానికి వ్యాయామం... సంగీతంతో బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్... డ్రాయింగ్, క్రాఫ్ట్ సాధన చేస్తే సృజన, మేధస్సు పెరుగుతాయి. విద్యతో పాటు కళలను కూడా అభ్యసించడంవల్ల పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు అలవడతాయి. ఉదాహరణకు నాట్యం ప్రారంభించే ముందు గురు వందనం చేస్తాం. అంటే గురువుకు, పెద్దలకు గౌరవం ఇవ్వడం బాల్యంలోనే నేర్చుకొంటారు. చదువు కంటే ముందు కావల్సింది సంస్కారం. అది లలితకళల అభ్యాసంతో వస్తుంది.

**నానమ్మ... నాన్నల నుంచి..**

నేను కళలవైపు రావడానికి ప్రధాన కారణం మా నానమ్మ, నాన్న. మాది సూర్యాపేట. నానమ్మకు జానపదా లంటే చాలా ఇష్టం. నాన్నకు సినిమా పాటలు పాడడం, నవలలు చదవడం అలవాటు. వారి ప్రభావం నామీద చిన్నప్పటి నుంచీ ఉంది. ఎప్పుడూ క్రాఫ్ట్... అవీ చేస్తుండేదాన్ని. లలిత సంగీతం కూడా నేర్చుకున్నాను. ఏంసీజే చదివాను. తరువాత ఎంఏ ఆర్ట్స్, బీఎడ్, టీటీసీ చేశాను. అంత చదువు కున్నా కళలపై మక్కువతోనే 2012లో 'బాల కేంద్రం'లో చేరాను.

**ఉదయం నుంచి...**

సూర్యాపేట బాల కేంద్రం సూపరింటెండెంట్‌గా నాకు వచ్చేది నాలుగువేల రూపాయల జీతమే. ఇది పార్ట్‌టైమ్ ఉద్యోగంలాగా! శిక్షణ ఇచ్చేది సాయంత్రం మూడు గంటలే అయినా... నేను ఉదయం నుంచి అదే పనిలో ఉంటాను. కొన్ని స్కూల్స్‌కు వెళ్లి కూడా ఫైన్‌ఆర్ట్స్ నేర్పిస్తుంటాను. పేద మహిళలకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో బ్యూటీషియన్ కోర్స్ చేశాను. మా కేంద్రంలోని పిల్లల తల్లితండ్రులతో ఒక కమిటీ వేశాను. ఆ కమిటీ ద్వారా మహిళలకు కుట్లు, అల్లికలు, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణనిస్తున్నా. దాతల సాయంతో ఉచితంగా మేకప్ కిట్లు ఇచ్చాను. దానివల్ల వారు ఉపాధి పొందుతారు. భర్తపైనే పూర్తిగా ఆధారపడకుండా కుటుంబ భారాన్ని కొంత పంచుకొంటారు. ఆసక్తి ఉన్నవారితో ఓపెన్ టెన్త్, ఇంటర్ రాయిస్తున్నాను. ఎందుకంటే చదువుతో వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మా కేంద్రానికి వచ్చే పిల్లలు మధ్యలో మానేస్తే అందుకు కారణాలు కనుక్కొంటాం. వారి కుటుంబానికి చేతనైన విధంగా సహకరించి పిల్లలను తిరిగి కేంద్రానికి వచ్చేలా చూస్తున్నాం.

**అవార్డులు... అభినందనలు...**

మేం చేస్తున్న నిరంతర కృషి వల్ల మా బాల కేంద్రం పిల్లలు నాట్యం, సంగీతం తదితర పోటీల్లో సత్తా చాటారు. ఆ విజయాలను గుర్తిస్తూ గవర్నర్, జిల్లా కలెక్టర్, డీఈఓ, ఇతర ప్రముఖులు నన్ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాదు... రాష్ట్ర మంత్రి, కలెక్టర్ల నుంచి మూడుసార్లు 'బెస్ట్ సర్వీస్' అవార్డు అందుకున్నాను. ముంబయిలోని 'అబ్దుల్ కలామ్ మెమోరియల్ ఆర్గనైజేషన్' ప్రపంచ తెలుగు మహాసభలు, ప్రముఖ కళా సంస్థల నుంచి పురస్కారాలు లభించాయి. ఇవి నా సేవలను మరింత విస్తరించడానికి ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చాయి.

**అప్‌గ్రేడ్ కోసం...**

ఇప్పుడు నా ముందున్న లక్ష్యం ఒక్కటే... సూర్యాపేట బాల కేంద్రాన్ని 'బాల భవన్'గా మార్చాలని. ప్రభుత్వం తలుచుకొంటే ఇది పెద్ద పనేమీ కాదు. దాని కోసం మా జిల్లా మంత్రికి విన్నవించాం. త్వరలోనే నెరవేరుతుందని ఆశిస్తున్నాం. 'బాల కేంద్రం' రోజుకు మూడు గంటలే పని చేస్తుంది. అదే 'బాల భవన్' అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుంది. దీనివల్ల పిల్లలు ఏ సమయంలోనైనా వచ్చి నేర్చుకొనే వెసులుబాటు ఉంటుంది. ■

# మల్చింగ్ షీట్ వేయడం ... ఇక సులభం !

## ఇద్దరు మనుషులు మల్చింగ్ షీట్ పరచవచ్చు ... 8 గంటల్లో ఎకరంలో పని పూర్తి

ఎత్తు మడులపై మల్చింగ్ షీట్ పరిచి ఉద్యాన పంటలు పండించడానికి సాధారణంగా ట్రాక్టర్‌కు అనుసంధానం చేసే పరికరాన్ని ఉపయోగిస్తుంటారు. ఎకరానికి 6 నుంచి 8 మంది కూలీల అవసరం ఉంటుంది. ఒక రోజు నుంచి రోజున్నర సమయం పడుతుంది. అయితే, సులువుగా, తక్కువ ఖర్చుతో మల్చింగ్ షీట్‌ను పరిచే పరికరాన్ని మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన యువకుడు రూపొందించారు. కేవలం ఇద్దరు మనుషులతో, 8 గంటల్లోనే ఎకరంలో మల్చింగ్ షీట్ పరచడానికి ఉపయోగపడే మల్చింగ్ పరికరాన్ని యువ ఉపాధ్యాయుడు, రైతు నితిన్ ఘులే పాటిల్ రూపొందించారు. నాసిక్‌లోని శివాజీ నగర్‌లో గల అభినవ్ బాల్‌వికాస్ మందిర్ పాఠశాలలో నితిన్ ఉపాధ్యాయుడుగా పని చేస్తూనే వ్యవసాయాన్ని మక్కువతో చేస్తుంటారు.





గత ఏడాది మే నెలలో తన 7 ఎకరాల భూమిలో టమాట, మిరప, బంతిపూలను సాగు చేయటం కోసం ఎత్తుమడులపై మల్చింగ్ షీట్ పరవాలని అనుకున్నాడు. అయితే, కూలీల కొరత వల్ల సాధ్యంకాలేదు. ఆ క్రమంలో మల్చింగ్ షీట్ పరిచే ప్రక్రియను సులభతరం చేసే పరికరాన్ని తయారు చేసుకునే ప్రయత్నం చేశాడు. తన వద్ద ఉన్న పాత ఇనుము వస్తువులను ఉపయోగించి, సొంత ఆలోచన ప్రకారం వెల్డింగ్ చేయించి ఒక పరికరాన్ని రూపొందించాడు. ట్రాక్టర్‌కు అనుసంధానం చేసి దీన్ని ఉపయోగించే ప్రయత్నం చేశాడు.

మల్చింగ్ షీట్ చిరిగిపోతుండటంతో.. ట్రాక్టర్ లేకుండా మనుషులు ఈడ్చుకుంటూ వెళ్తూ మల్చింగ్ షీట్ పరిచేలా మార్పులు చేశాడు. పరికరం అడుగున చక్రాలను అమర్చటంతో పాటు.. పరిచిన షీట్‌పై మట్టి ఎగదోయడానికి వీలుగా రెండు ఇనుప బ్లేడ్లను అమర్చడంతో ఈ పరికరం సిద్ధమైంది. 15 రోజులు కష్టపడి అనేక విధాలుగా మార్పులు చేస్తూ చివరికి విజయం సాధించారు. తన పొలంలోఉపయోగించడం తో పాటు మరో ఇద్దరు రైతులకు కూడా ఈ పరికరాన్ని ఇచ్చి పరీక్షించాన్నారు నితిన్.

'మా ప్రాంతంలో ఎకరంలో మల్చింగ్ షీట్ పరచడానికి 12 మంది కూలీలు అవసరం. వారి కూలి, తిండితో కలిపి రూ. 8 వేల వరకు రైతుకు ఖర్చవుతుంది. నేను ఈ పరికరాన్ని రూ. 10 వేలకే తయారుచేసి ఇస్తున్నాను. ఒక్కసారి కొనుక్కుంటే చాలు. ఇద్దరు మనుషులతో దీనితో మల్చింగ్ షీట్ పరచవచ్చు. ఎకరాన్ని 8 గంటల్లోనే పూర్తి చేయవచ్చు. చిన్న రైతులకు ఇది చాలా బాగా ఉపయోగపడుతోంది. కూలీలతో కూడా పని లేకుండా రైతు కుటుంబ సభ్యులే దీన్ని ఉపయోగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని కొద్ది రోజుల్లోనే వంద మంది రైతులు ఇది కావాలన్నారు..' అని నితిన్ (98909 82432) సంతోషంగా చెప్పారు. ■

# ఏ గేదెను ఎంచుకోవాలి ? ఎలా పోషించాలి?

**(11వ పేజీ తరువాయి)**

కొనకపోవడం మంచిది.

**గేదెల పోషణ :** గేదెల పోషణ అవసరాలు వాటి శరీర బరువు, పెరుగుదల, పాల ఉత్పత్తి, పాలలోని వెన్నశాతం, చూడి మీద ఆధారపడి ఉంటాయి. గేదెకు తన శరీర బరువులో 3% ఘనపదార్థం అవసరం. గడ్డిరకం పచ్చిమేతలో 25%, కాయజాతి పచ్చిమేతలో 20%, ఎండుమేత, దాణాలో 90% ఘన పదార్థముంటుంది. దీనిని బట్టి ఇవ్వవలసిన మేతను లెక్కించాలి. గేదెకిచ్చే మొత్తం ఘన పదార్థంలో 60-65 శాతం పీచు పదార్థం,35-40 శాతం దాణా పదార్థం ఉండాలి. పచ్చి, ఎండు మేతల ద్వారా పీచు పదార్థం గేదెకు ఇవ్వాలి. ఇది ఘన పదార్థ రూపేణా రెండొంతుల పీచు పదార్థం పచ్చిమేత నుండి, ఒక వంతు ఎండు మేత నుండి గేదెకు ఇవ్వాలి. అలాగే పచ్చి మేతలో రెండు పాళ్ళు ధాన్యపు జాతికి లేదా గడ్డి రకాలకి, ఒక పాలు కాయజాతికి చెందేలా ఉండాలి. దాణాలో ముఖ్యంగా ధాన్యపు గింజలు, నూనెగింజల చెక్కలు, తవుడు, లవణ మిశ్రమం, ఉప్పు ఉంటాయి. పప్పుల మిల్లుల నుండి లభ్యమయ్యే వ్యర్థ పదార్థాన్ని (పొట్టు) కూడా దాణాలో ఉపయోగించవచ్చు.



గేదెకిచ్చే పచ్చిమేత రెండు రకాలు - ఇవి గడ్డి, కాయజాతి రకాలు. గడ్డి రకాల్లో గినిగడ్డి, హైబ్రిడ్ నేపియర్ రకాలైన ఎపిబిఎన్-1, కో-1, కో-3 మొదలైన బహువార్షికాలు, మొక్కజొన్న, జొన్న, సజ్జ, రాగులు, కొర్ర వంటి ఏకవార్షికాలను మేపవచ్చు. అలాగే కాయజాతి పశు గ్రాసాల్లో స్టైలో, లూసెర్న్, వెల్వెట్ బీన్, ఫీల్డ్‌బీన్ వంటి బహువార్షికాలు, జనుము, అలసంద, పిల్లిపెసర, బెర్సీం, ఉలవలు వంటి ఏకవార్షికాలను మేపుకోవచ్చు. ఎండు మేతలో ముఖ్యంగా వరిగడ్డి, జొన్నచొప్ప, మొక్కజొన్న చొప్ప, వేరుశనగ కట్టె మొదలైనవి ఇవ్వవచ్చు.

**అధిక పాల దిగుబడినిచ్చే గేదెల పోషణ**

అధిక పాల దిగుబడినిచ్చే గేదెలలో ఎక్కువ మొత్తంలో పోషక పదార్థాలు వాటి శరీరం నుండి పాల ద్వారా బయటకు వస్తాయి. వీటిని సరిగా మేపకపోయినట్లయితే పాలదిగుబడి తగ్గిపోవడమే కాకుండా గేదెల ఆరోగ్యం కూడా దెబ్బతినే ప్రమాదం వుంది. కనుక గేదెల పాల దిగుబడికి దీటుగా గేదెలను మేపవలసి వుంటుంది. ఈ పద్ధతిని 'ఛాలెంజ్ ఫీడింగ్' అంటారు. ఛాలెంజ్ ఫీడింగ్ గేదె ఈనడానికి రెండు వారాల ముందునుండి ప్రారంభించాలి. చూడి గేదెకు మామూలుగా ఇచ్చే దాణా కంటే అదనంగా మొదటిరోజు 500 గ్రా దాణా పెంచి, తరువాత ప్రతిరోజు 300-400గ్రా దాణా పెంచుతూ వెళ్ళాలి. ఈవిధంగా గేదె 500 గ్రా నుండి ఒక కిలో దాణా ప్రతి 100 కిలోల శరీర బరువుకు తీసికొనేటట్లు చేయాలి. గేదె ఈనిన తరువాత మామూలుగా ఇస్తున్న దాణా కంటే అదనంగా 500 గ్రా దాణాతో ప్రారంభించి 2 వారాలలో అది తినగలిగి నంత దాణా ఇవ్వాలి. ఇలా గేదె ఆ ఈతలో అత్యధిక పాలను ఉత్పత్తి చేసే రోజు వరకు ఇవ్వాలి. ఇది సాధారణంగా గేదె ఈనిన తరువాత రెండవ నెలలో ఉంటుంది. తరువాత గేదెకు దాని పాల ఉత్పత్తిని బట్టి 1 కిలో దాణా ప్రతి రెండు కిలోల పాల ఉత్పత్తికి ఇవ్వాలి.

**గేదె సక్రమంగా తినాలంటే ఏం చెయ్యాలి?**

పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చులో దాదాపు 60-70 శాతం మేతకు అవుతుంది. కనుక పశువుకిచ్చే మేత వ్యర్థం కాకుండా సక్రమంగా సద్వినియోగానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలి. పచ్చి, ఎండు మేతను చాఫ్‌కట్టర్ ద్వారా అంగుళం సైజు

ముక్కలుగా కత్తిరించి ఇవ్వాలి. దీనివలన దాదాపు 20-30 శాతం మేత వృధా కాకుండా కాపాడుకోవచ్చు. కాండం బాగా లావుగా ఉండే మొక్కజొన్న, జొన్న, హైబ్రిడ్ నేపియర్, గిని మొదలైన వాటిని ఛాప్ చెయ్యకుండా ఇచ్చినట్లయితే గేదెలు ఆకుల చివర్లు తిని కాండాలు వదిలేస్తాయి. దీనివలన కాండంలోని పోషక విలువలు గేదెకు చేరవు. పచ్చి, ఎండుమేతను కలిపి ఛాప్ చెయ్యడం వలన గేదె ఎండు మేతను వదిలివెయ్యకుండా నివారించవచ్చు. గేదెలకు మేతతొట్లు లేనట్లయితే గేదెకిచ్చే మేత మట్టిలో కలిసి కొంత వ్యర్థమవుతుంది. కత్తిరించిన గడ్డిని పశువుకిచ్చేటప్పుడు మేతతొట్లలో వేసి మాత్రమే గేదెలకు మేపాలి. ఛాప్ చెయ్యడం వలన ముదిరిన గడ్డిని కూడా వినియోగించుకోవచ్చు.

**వివిధ తరగతుల గేదెలకు కావలసిన స్థలం**

| వ. నెం | తరగతి | ప్రతి పశువుకు అవసరమయ్యే స్థలం (చ.మీ) కప్పు ఉన్న ప్రాంతం | కప్పు లేని ప్రాంతం | ఒక షెడ్డు ఉండగల అత్యధిక గేదెల సంఖ్య |
|---|---|---|---|---|
| 1. | దున్నపోతు | 12 | 12 | 1 |
| 2. | గేదెలు | 4 | 8 | 50 |
| 3. | ఈనబోయే గేదెలు | 12 | 12 | 1 |
| 4. | చిన్నదూడలు (3 నెలలు దాటినవి) | 2 | 4 | 30 |
| 5. | చిన్న దూడలు (8 నెలల లోపు) | 1 | 1 | 80 |

**లూజ్ హౌసింగ్ గృహ వసతి పద్ధతి** : గేదెలకు చాలా సౌకర్యవంతంగా, ముఖ్యంగా వేసవికాలంలో గేదెల మీద ఉష్ణపు ఒత్తిడి తక్కువగా వుంటుంది. పశువులు తినగలిగినంత మేత, నీరు తీసికొనే వీలుంటుంది. తక్కువమంది కూలీలు సరిపోతారు. దీనివలన ఖర్చు తగ్గుతుంది. ఎలాంటి ఇబ్బంది లేకుండా అదనపు గేదెలను షెడ్‌లో ఉంచవచ్చు. నీటి తొట్టిలో 'ఫ్లోట్ వాల్వ్' ఏర్పాటు వలన తొట్టిలో నీరు తగ్గినప్పుడు ఆటోమాటిక్‌గా నీరు వచ్చి, ఎల్లప్పుడూ నీరు పెట్టే అవసరం ఉండదు. యాజమాన్యం సులభమవుతుంది.

**గేదెల పాకలు**

లూజ్ హౌసింగ్ పద్ధతిలో గేదెలను అసలు కట్టివేయకుండా, వాటి ఇష్టమొచ్చినట్లు కొంత ప్రదేశంలో తిరిగేందుకు వీలు కలిపిస్తారు. ఈ పద్ధతి గృహవసతిలో కవర్డ్ ఏరియా (కప్పు ఉన్న ప్రదేశం), ఓపెన్ ఏరియా (కప్పులేని ప్రాంతం) అనే రెండు భాగాలుంటాయి. కప్పు ఉన్న ప్రదేశంలో మేత తొట్టి ఉంటుంది. గేదెలు వాటికిష్టమైనప్పుడు మేత తింటాయి. ఎండ, వర్షం, చలి మొదలైనవాని నుండి ఈ ప్రదేశంలో రక్షణ ఉంటుంది. కప్పులేని ప్రదేశం అంటే బహిర్గత ప్రదేశం చుట్టూ ఇనుప పైపుల్ని లేదా వాసాల్ని మూడు నాలుగు వరుసల్లో అమర్చి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ ప్రదేశం చుట్టూ చెట్లను పెంచినట్లయితే చల్లగా ఉండి గేదెలకు సౌకర్యవంతంగా ఉంటుంది. నీటి తొట్లని ఈ ప్రదేశంలో అమర్చుతారు. ఈ స్థలానికి ఒక వైపున గేటు ఏర్పాటు చేసుకోవాలి. ముళ్ళతీగతో బహిర్గత ప్రదేశం చుట్టూ ఫెన్సింగ్ చేయరాదు. ఇలా చేసినట్లయితే ఫెన్సింగ్ తీగ గీసుకుపోయి పశువులకు, మనుషులకు గాయాలయ్యే ప్రమాదముంది.

**పాలు పితికే షెడ్డు**

ఈ షెడ్డు పూర్తిగా కవర్ చెయ్యబడి ఉంటుంది. దీనిలో పాడిగేదెల నుండి పాలు తీస్తారు. ఈ షెడ్డు సాధారణంగా మధ్యలో ఉండి చుట్టూ మిగిలిన షెడ్లు ఉంటాయి. ఈ షెడ్డు లోపల ఒక్కొక్క గేదెకు విడివిడిగా పార్టిషన్లు చెయ్యబడి ఉంటుంది. ఇవి ఒక వరుస లేదా రెండు వరుసల్లో ఉంటాయి. రెండు వరుసల్లో వున్నట్లయితే తోకలు – తోకలు అభిముఖంగా ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. గేదెలు నిలబడే స్థలం పొడవు 1.5 – 1.7 మీటర్లు, వెడల్పు 1.0 – 1.20 మీటర్లు ఉండాలి. ఈ స్థలం రెండువైపులా 'యు' ఆకారంలో 30 సెం.మీ వెడల్పుతో డ్రైనేజీలు నిర్మించాలి. గచ్చు డ్రైనేజ్ వైపు పల్లంగా ఉండేటట్లు చూడాలి. దాణా తొట్టి వెలుపల 0.75 మీటర్ల స్థలం దాణా వెయ్యడానికి వదలాలి. షెడ్డు లోపలి నేల సిమెంటు కాంక్రీటు చేయించి గాడులు పెట్టాలి. దీనివలన గేదె జారదు. డ్రైనేజ్ వైపు గల నేలను పల్లంగా ఉండేటట్లు ఏర్పాటు చెయ్యాలి.

**షెడ్డు నిర్మాణం:** షెడ్డు నిర్మాణానికి రాతి / కాంక్రీటు /

ఇటుకలతో నిర్మించిన స్తంభాలు, తాటి / సరివి కర్రలు వాడవచ్చు. షెడ్డు పై కప్పుకు ఆస్‌బెస్టాస్ / గాల్వనైజ్డ్ / ఇనుప షీట్లు, తాటాకు / కొబ్బరి ఆకులు, రెల్లుగడ్డి, జొన్నచొప్ప, వరిగడ్డి మొదలైనవి వాడవచ్చు. ఫెన్సింగ్‌కు 2 అంగుళాల జిఐ ఇనుప పైపులు, వాసాలు మొదలైనవి వాడవచ్చు. షెడ్డు పై కప్పు మధ్యలో 4 మీటర్ల ఎత్తు ఉండాలి. చూరు 2 మి. ఉండాలి. కవర్డ్ , ఓపెన్ ఏరియాల మధ్య పేడ కాలువ 30 సెం.మీ వెడల్పుతో ఉండాలి. షెడ్డు లోపలి నేల పేడ కాలువ వైపుకు ప్రతి మీటరుకు 3 సెం.మీ వాలు ఉండాలి. షెడ్డు మధ్యలో 1.5 – 1.8 మీ వెడల్పు గల దారిని ఏర్పరచితే కత్తిరించిన పచ్చి మేతను ట్రాక్టర్ / బండి సహాయంతో సులభంగా మేత తొట్లలో వేయవచ్చు.

**చూడి గేదెల సంరక్షణ**

చూడి గేదెను ఈనడానికి రెండు వారాల ముందు పాలు తీయకుండా ఎండకట్టాలి. ఇలా పాలు తీయకుండా ఆపడం ఒక్కసారి చెయ్యరాదు. మొదట రెండు పూటల నుండి ఒక్క పూటకు, తరువాత ఒకరోజు నుండి రెండు మూడు రోజులకు ఒకసారి తరువాత వారానికొకసారి పాలు తీస్తూ ఎండ కట్టాలి. ఇలా ఎండకట్టడం వలన గేదె ముందు ఈతలో పాల ద్వారా కోల్పోయిన పోషక పదార్థాలను తిరిగి పొంది మరుసటి ఈతలో పాలు బాగా ఇస్తుంది. చూడి చివరి మూడు మాసాలు గేదెల పోషణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎందుకంటే దూడ పెరుగుదల మూడింట రెండు వంతులు చివరి మూడు మాసాల్లోనే ఉంటుంది. కనుక చూడి గేదెకు తిన్నంత పచ్చిమేతకు అదనంగా 2 కిలోల దాణాను ఇవ్వాలి.

ఈనడానికి రెండు వారాల ముందు గాలి, వెలుతురు బాగా ఉండే పరిశుభ్రమైన పాకలోకి మార్చాలి. నేల ఎగుడుదిగుడులు లేకుండా చదునుగా చేసి పొడిగడ్డితో కప్పి ఉంచాలి. చూడి గేదెకు మెయ్య కనిపించడం జరిగితే నేల వెనుక భాగం ముందు భాగం కంటే ఎత్తుగా ఉండేటట్లు జాగ్రత్త తీసుకోవాలి. ఇలాంటి గేదెలకు సులభంగా జీర్ణమయ్యే మేత, దాణా ఇవ్వాలి. గేదె ఈనిన తర్వాత 8 గంటలలోపు మాయ పడనట్లయితే పశువైద్యుని సంప్రదించాలి.

**గేదె దూడల సంరక్షణ**

గేదె దూడల సంరక్షణ తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండి మొదలు కావాలి. అంటే చూడి గేదెలను బాగా మేపినట్లయితే ఆరోగ్యవంతమైన ఎక్కువ బరువు కలిగిన దూడ పుడుతుంది. దూడ పుట్టిన వెంటనే ముక్కులో ఉన్న జిగురు పదార్థాన్ని తుడిచివేయాలి. వంటి మీద ఉన్న జిగురు పదార్థాన్ని తల్లినాకనట్లయితే పొడి బట్టతో శుభ్రంగా తుడవాలి. బొడ్డును శరీరానికి రెండంగుళాల దిగువన దారంతో కట్టి ముడి దిగువ భాగంలో తుప్పు పట్టని కత్తెరతో కత్తిరించి టించరు అద్దాలి. ఇలా చేయడం వలన చీము పట్టడం జరగదు. పుట్టిన అరగంటలోపు దూడకు జున్నుపాలు త్రాగించాలి. జున్ను పాలలోని వ్యాధి నిరోధక యాంటీబాడీలు దూడలను వివిధ వ్యాధులను బారినుండి కాపాడతాయి. జున్నుపాలలో విటమిన్ 'ఎ', ఖనిజ లవణాలు మామూలు పాల కంటే 3 రెట్లు ఎక్కువగా వుండి దూడలకు చాలా బలవర్థకమైన ఆహారంగా పని చేస్తాయి. దూడలకు మొదటిసారి విరేచనం కావడానికి కూడా జున్ను దోహదం చేస్తుంది. ఒకవేళ ఏదేని కారణం చేత జున్ను పాలు దూడకు లభించనట్లయితే ఒక కోడిగుడ్డు, అర టీ స్పూన్ ఆముదం, 600మిలీ పాలు, 10,000 ఐ.యు. విటమిన్ 'ఎ' మి.గ్రా. అరియోమైసిన్ పొడి కలిపిన మిశ్రమాన్ని దూడకు ఇవ్వాలి. గాలికుంటు వ్యాధితో బాధపడుతున్న గేదెకు జన్మించిన దూడకు తల్లి జున్నుపాలు త్రాగించకూడదు. వేరొక గేదె జున్ను పాలుగాని లేదా పైన పేర్కొన్న మిశ్రమాన్ని గాని ఇవ్వవచ్చు.

ఇలా పెంచిన దూడ ప్రతిరోజు 400–500 గ్రా పెరిగి రెండు సంవత్సరాల కాలంలో 200–250 కిలోల బరువు పెరిగి కట్టడానికి తయారవుతుంది. ఈవిధమైన పోషణకు 4 వేలు ఖర్చయితే, మనకు 15 వేల నుండి 16 వేల విలువైన పాడి పశువు తయారవుతుంది.

**దూడల ఆరోగ్యపరిరక్షణ**

దూడ పుట్టిన మొదటి రోజు పేడ వెయ్యకపోతే 1/4 లీటరు మజ్జిగలో 100 గ్రా ఆముదం కలిపి ఇవ్వాలి. లేదా కోడిగుడ్డు సొన, ఇంగువ, బెల్లం పాలలో కలిపి త్రాగిస్తే మలబద్ధకం పోతుంది. దూడలను రెండు నెలల వరకు

సరైన నిర్ణయం ఆత్మవిశ్వాసాన్ని పెంచితే, తప్పుడు నిర్ణయం అనుభవాన్ని పెంచుతుంది ; రెండూ మంచికే

విడివిడిగా చదునైన నేల మీద పొడిగడ్డిని పరచి పెంచాలి. న్యుమోనియా రాకుండేందుకు వర్షాకాలం, చలికాలంలో షెడ్డు చుట్టూ పట్టాలు కట్టాలి. కాక్సీడియోసిస్ రాకుండేందుకు దూడల పాక చుట్టూ 15 రోజులకొకసారి పొడిసున్నం చల్లాలి. మొదటి 7వ రోజు తర్వాత ప్రతి 20 రోజులకోసారి పైపర్‌జిన్ ఎడిపేట్ మందును కిలో బరువు దూడకు 200-400 మి.గ్రా చొప్పున త్రాగించినట్లయితే ఏలిక పాముల బారి నుండి రక్షించవచ్చు. వీనింగ్ పద్ధతి ద్వారా పెంచే దూడలకు పాలు పితికిన వెంటనే గోరువెచ్చగా చేసి రోజూ ఒకేసమయంలో దూడ శరీరబరువును బట్టి పట్టించాలి. అలాగే పాలపాత్రలు కూడా ప్రతిరోజూ పరిశుభ్రంగా కడిగి ఎండబెట్టి నట్లయితే పారుడు వ్యాధిని అరికట్టవచ్చు. దూడలకు పిడుదులు, పేలు, గోమార్లు ఆశ్రయించకుండా నెలకొకసారి లీటరు నీటికి ఎక్టోడిక్స్ ద్రావణం 3-4 మి.లీ కలిపి దూడల శరీరంపై పిచికారి చేయాలి.

**వీనింగ్ పద్ధతి లేదా దూడను వేరు చేసి పెంచే పద్ధతి**

దూడను పుట్టిన వెంటనే లేదా జున్ను పాలు త్రాగడం పూర్తయిన తర్వాత గానీ తల్లి నుండి వేరు చేసి పెంచడాన్ని 'వీనింగ్ పద్ధతి' అంటారు. దీనివలన దూడకు ఎంత పాలు ఇస్తున్నదీ, పశువు పాల దిగుబడి ఎంతో కచ్చితంగా తెలుస్తుంది. ఏదేని కారణం చేత దూడ చనిపోయినా కూడా తల్లి పాలు ఇవ్వడం మానదు. పాడి గేదెలు త్వరగా ఎదకు వచ్చి మరలా కట్టే అవకాశముంది. వీనింగ్ పద్ధతిలో దూడకు పాత్ర నుండి జున్నుపాలు లేదా పాలు త్రాగించడం నేర్పించాలి. మొదట చేతివేళ్ళను పాలలో ముంచి దూడ నోటికి అందించాలి. ఇలా చేస్తూ నిదానంగా దూడ తలను పాల దగ్గరకు తీసికొనివచ్చి పాలు త్రాగేటట్లు చెయ్యాలి. దూడ పాలు త్రాగిన వెంటనే నాలుక మీద ఉప్పు రాస్తే అది వేరే దూడను నాకదు.

**దూడల పోషణ**

మూడు నెలల వరకు దూడ శరీర బరువులో 10 శాతం పాలు తప్పనిసరిగా ఇవ్వాలి. 15 రోజుల వయసు నుండి బలవర్ధకమైన, సులభంగా జీర్ణమయ్యే దూడల దాణా తినిపించాలి. ఈ దాణా మొదటి నెల వయసులో 150 గ్రాములు మూడవ నెలలో 300 గ్రాములు, నాల్గవ నెలలో 500 గ్రాములు 5, 6 మాసాల్లో 750 గ్రాములు, 7వ నెల నుండి సంవత్సరం వరకు 1 కిలో చొప్పున ఇవ్వాలి. 15 రోజుల వయసు నుండి ఎండబెట్టిన కాయజాతి పశు గ్రాసాలయిన అలసంద, లూసెర్న్ లేదా పిల్లి పెసర ఇవ్వాలి. దూడలకు 4వ నెలలో గొంతు వాపు, జబ్బవాపు వ్యాధి నిరోధక టీకాలు, 6వ నెలలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలి. దూడల పాకలో లవణమిశ్రమం, ఉప్పు కలిగిన రాళ్ళను వేలాడదీసి నట్లయితే దూడలు వాటిని నాకి ఆరోగ్యవంతంగా పెరుగుతాయి.

**గేదెల పునరుత్పత్తిలో తీసుకొనవలసిన జాగ్రత్తలు**

గేదె తన జీవిత కాలంలో ఎక్కువ పాలను, దూడలను ఇవ్వాలంటే వానిని త్వరగా యుక్త వయసుకు తెచ్చి, చూలు కట్టించి 10 సంవత్సరాల కాలంలో కనీసం 6 నుండి 7 ఈతలు ఈనేటట్లు చెయ్యాలి. గేదెలలో ఎదను గుర్తించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా ముర్రా / గ్రేడెడ్ ముర్రా జాతి గేదెలు ఎదకు వచ్చినపుడు అరవవు. దీనినే మూగ ఎద అంటారు. ఎదలో ఉన్న గేదెను జాగ్రత్తగా పరిశీలించి గాని లేదా టీజర్ ఆబోతు ద్వారా గాని గుర్తించాలి. మూగ ఎదలో ఉన్న గేదె కరిమి ఉబ్బుతుంది. తోక పైకి లేపి తరచు మూత్ర విసర్జన చేస్తుంది. మేత సరిగా తినకపోవడం ద్వారా పాలు తగ్గడం, చుట్టూ తిరగడం వంటి లక్షణాల ద్వారా ఎదను గుర్తించవచ్చు.

వేసెక్టమీ చేసిన ఆబోతును ఉపయోగించి మూగ ఎదలో ఉన్న పశువులను తేలికగా గుర్తించవచ్చు. సాధారణంగా గేదెలు తెల్లవారుజామున లేదా రాత్రిపూట ఎక్కువగా ఎదకు వస్తాయి. కనుక ఈ సమయంలో గేదెలను ప్రతిరోజూ జాగ్రత్తగా గమనించాలి. ఆరోగ్యవంతమైన గేదె ఈనిన 60 రోజుల నుండి ప్రతి 20 రోజులకొకసారి ఎదకు వస్తుంది. కనుక గేదె ఎదకు వచ్చిన తేదీ రికార్డు చేసినట్లయితే ఆ ఎదలో గర్భధారణ చేయించకపోయినా మరలా గేదె ఎప్పుడు ఎదకు వస్తుంది తెలుస్తుంది.

**మేలుజాతి పశువుల అభివృద్ధికి కృత్రిమ గర్భధారణ**

పశువుల్లో పునరుత్పత్తి అంటే, చూలు కడుతూ,

ఈనుతూ సంతానోత్పత్తి చేయడం, పశువు సక్రమంగా చూలు కడుతూ, ఈనుతుంటే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుంది. దీనికిగాను పశువుల్లో పునరుత్పత్తి ప్రక్రియకు ముఖ్యంగా కృత్రిమ గర్భధారణ పద్ధతిలో మెళకువలు తెలుసుకోవాలి.

కృత్రిమ గర్భధారణ పద్ధతిలో మేలుజాతి ఆబోతు లేక దున్నపోతు వీర్యాన్ని కృత్రిమంగా, పరికరాల ద్వారా సేక రించి, ఆవు లేదా గేదె ఎదకు వచ్చిన తర్వాత, ఆ వీర్యాన్ని ఆడ పశువు గర్భకోశ ముఖద్వారంలో ప్రవేశింపచేస్తారు. ఆ తర్వాత పశువు చూడికట్టి సంతానోత్పత్తి చేస్తుంది. కావున అధిక పాల దిగుబడినిచ్చే మేలుజాతి పశూత్పత్తి చేసుకోవ డానికి కృత్రిమ గర్భధారణ పద్ధతి ఒక ముఖ్యమైన మార్గం.

**కృత్రిమ గర్భధారణ వల్ల లాభాలు:** మేలుజాతి ఆబోతు లేదా దున్నపోతు పోషణ చాలా ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి, కృత్రిమ గర్భధారణ పద్ధతిని అవలంబిస్తే రైతుకు ఖర్చు తక్కువ. మేలుజాతి ఆబోతుల / దున్నపోతుల కొరత తీర్చ వచ్చు. ఏదేని ప్రాంతంలోని మేలు జాతి ఆబోతు / దున్నపోతు వీర్యాన్ని ఎన్నో వేల ఇతర పశువులను చూడి కట్టించ డానికి ఉ పయోగించవచ్చు. గర్భకోశ, పునరుత్పత్తికి సంబంధించిన వ్యాధులను అరికట్టవచ్చు. మేలుజాతి ఆబోతు / దున్న పోతు వీర్యాన్ని శీతలీకరణ పద్ధతిలో నిల్వ వుంచి, ఆబోతు చనిపోయిన తర్వాత కూడా దాని మేలు జాతి వీర్యాన్ని ఉపయోగించవచ్చు.



**కృత్రిమ గర్భధారణకు ముందు జాగ్రత్తలు :** పశువు రుతుక్రమం గమనించి ఎదకు వచ్చిందా లేదా తెలుసు కోవాలి. ఎద లక్షణాలు స్పష్టంగా గుర్తించాలి. మొట్టమొదటి సారి పశువును కట్టించినట్లయితే ఆ పశువు పెరుగుదల సక్రమంగా ఉన్నదీ లేనిదీ తెలుసుకోవాలి. ఆవు పెయ్యలు కనీసం 220-250 కిలోలు, గేదెపడ్డలు 230-250 కిలోల బరువు కలిగి ఉంటేనే తొలిసారి చూలు కట్టించాలి. చూలు కట్టించే ముందు, ఏ ఆబోతు / దున్నపోతు వీర్యం చేత చూలు కట్టించాలనేది జాగ్రత్తగా నిర్ణయించుకోవాలి. ఎదకు వచ్చిన పశువు మీద ఇతర ఆబోతులు / దున్నపోతులు ఎక్కకుండా జాగ్రత్తపడాలి. కృత్రిమ సంపర్కం చేయించడానికి సరైన సమయాన్ని గుర్తించాలి. ఎద లక్షణాలు ఆవుల్లో 24 గంటలు, గేదెల్లో 24 నుండి 36 గంటలు మాత్రమే ఉంటాయి. కాబట్టి ఎద లక్షణాలు గుర్తించి ఎద మధ్యకాలంలో గాని, ఎద చివరి కాలంలో గాని కృత్రిమ గర్భధారణ చేయించాలి. పశువులను కృత్రిమ గర్భధారణకు తీసుకువెళ్ళే ముందు పశువు వెనుక భాగం శుభ్రంగా కడిగి ఉంచాలి.

**కృత్రిమ గర్భధారణ తర్వాత జాగ్రత్తలు:** పశువులకు చూలు కట్టించిన తరువాత మరుసటి రోజు వరకు ఇతర ఆబోతులు లేదా దున్నపోతులు ఎక్కకుండా జాగ్రత్తపడాలి. కృత్రిమ గర్భధారణ కేంద్రంలో చిరునామా నమోదు చేయించు కోవాలి. పశువును కొట్టడం, బెదిరించడం చేయరాదు. తిరిగి 21 రోజులకు ఎదకు వచ్చిందా లేదా గమనించాలి. ఎదకు వస్తే తిరిగి చూలు కట్టించాలి. ఇలా రెండు మూడు పర్యాయాలు చూలు కట్టించినా చూలు నిల్వకపోతే పశువులో లోపం ఉందని గ్రహించాలి. వెంటనే దగ్గరలో ఉన్న పశు వైద్యుని సలహా పాటించి తగిన చర్యలు తీసుకోవాలి.

కృత్రిమ గర్భధారణ చేయించిన తర్వాత 21 రోజులకు పశువు తిరిగి ఎదకు రాకపోయినట్లయితే పశువు చూలు కట్టడానికి ఎక్కువ అవకాశముంది. దానికి 45 రోజుల తర్వాత పశువైద్యునిచే చూలు నిర్ధారణ జరిపించి చూడి పశువులకు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**చూలు సరిగా జరిగి సులువుగా ఈనాలంటే:**

గర్భాశయానికి సంబంధించిన రోగాలను నివారిం చాలి. సాధ్యమైనంత వరకు కృత్రిమ గర్భోత్పత్తి పద్ధతినే వాడాలి. పశువు ఈనే సమయంలో తగు జాగ్రత్తలు తీసు కోవాలి. పశువైద్యులచే పశువులను తరచుగా పరీక్ష చేయించుకోవాలి. ■

అవకాశాలు, అదృష్టమూ సూర్యోదయం లాంటివి ; సమయానికి మేలుకోకపోతే అందకుండా పోతాయి

# భూమిలో మూడు అంతస్తులుగా కూరగాయల సేద్యం !

*రైతులు తరచుగా వారి పొలాలలో తమ ఆలోచనలకు పదునుపెడుతూ, స్థానిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటారు. ఈ కొత్త ప్రయత్నాలు, నవకల్పనలు స్థానిక పర్యావరణపరంగా, జీవావరణపరంగా సునిశిత పరిజ్ఞానం, పర్యావరణరీత్యా ఉండే అనుకూలతలను బట్టి ఉంటాయి. భారతదేశంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కొద్దిగా ఎత్తైన ప్రదేశంలో ఉండే హిమాలయ ప్రాంతంలోని ఒక గ్రామంలో సన్నకారు రైతులు అభివృద్ధి చేసిన కూరగాయల సేద్యపు పద్ధతులు ఈ కోవకు చెందినవే. వాటిని గురించి ఇప్పుడు తెలుసుకుందాం.*

**మ**న దేశంలోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కుమావోన్ ప్రాంతంలో భూమికి 1100 మీటర్ల ఎత్తులో హిమాలయ పర్వతశ్రేణిలో వుండే కుగ్రామం మక్రావ్. ఇక్కడ వ్యవసాయం పైన, సంబంధిత జీవనోపాధులపైనా ఆధారపడి జీవిస్తూ రమారమి 85 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామంలో ఇంచు మించుగా 50 హెక్టార్ల సేద్యపు భూమి వుంది. రాగులు, ఊదలు, వరి, గోధుమ , ఆవాలను పండిస్తూ ఉండే ఈ భూమి ఇంచుమించు 90 శాతం మేరకు వర్షాధార ప్రాంతంగా వుంటుంది. (ఊదలను తెలుగులో కోడిసామ అనికూడా అంటారు. కన్నడంలో కూడా వీటిని ఊదలు అనే అంటారు. తమిళంలో కుతిరైవాలి అని, హిందీలో సాన్వా అని, బెంగాలీలో శ్యామ అని అంటారు). నీటి పారుదల చేసే ప్రాంతంలో వుండే చిన్న చిన్న ప్రదేశాలు కూరగాయల సేద్యం క్రింద వుంటాయి. ఈ గ్రామంలో ఒక్కో కుటుంబానికీ ఉండే వ్యవసాయ యోగ్యమైన భూమి నిరుపయోగంగా వుండకుండా వారి బంధువులు గానీ లేక వారి చుట్టుపక్కలవారు గానీ సాగు చేస్తారు. ఈ గ్రామానికి మంచి రోడ్లు వున్నందున రవాణా సౌకర్యం, మార్కెట్ అందుబాటు బావుంది.







**బహుళ పొరలలో సేద్యం**

ఇంచుమించు ఒక శతాబ్దం క్రితం ఈ గ్రామ పెద్దలు దాదాపు 5 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న కొంత భూమిని కూరగాయల సేద్యానికి పనికి వచ్చే విధంగా అభివృద్ధి చేశారు. అంతకుముందు ఈ భూమికి స్థానికంగా 'గూల్స్' అని పిలిచే నీటిపారుదల వ్యవస్థ ద్వారా నీటిపారుదల కల్పించేవారు. ప్రస్తుతం ప్రభుత్వ పథకాల సహకారంతో స్టోరేజ్ ట్యాంకులు, నీటి పారుదల కాలువలు చక్కగా నిర్మించబడి ఉన్నాయి. మొదట్లో క్యారట్, బంగాళాదుంప, చేమదుంప వంటి కాయగూరలు, ఆకుకూరలు, కొత్తిమీర, పసుపు, వెల్లుల్లి వంటి సుగంధపు పంటలు సాగు చేయబడుతూ ఉండేవి. చేమ దుంపను సాంప్రదాయికంగా సంవత్సరానికి ఒకే ఒక పంటగా పండించే భూములలో మరొక పంటను పండించే అవకాశం ఉండేది కాదు.

ఈ చేమదుంప పంట పండే కాలవ్యవధి ప్రతి సంవత్సరం జనవరి నెల నుండి మొదలై ఇంచు మించు 7-8 నెలలు ఉంటుంది. అలాగే చేమదుంప వేళ్ళు ఏర్పడి, కాండం నేలపై తలెత్తి మొలిచేసరికి 60-80 రోజులవరకూ పడుతుంది. మొక్క ఆలస్యంగా పెరగడం వల్ల చేమదుంపను సాగుచేసే భూముల్లో నేల పై పొర చెప్పుకోతగినంత కాలం నిరుప యోగంగానే ఉంటుందని గ్రహించి, రైతులు మెరుగైన

గెలుపే ఆనందానికి మూలం కాదు, అయితే ఆనందం గెలిచే బలం యిస్తుంది

ఉత్పత్తికోసం ఈ వనరులను మరింత లాభసాటిగా వినియోగించే మార్గాలను అన్వేషించారు. ముందుగా, అంటే చేమదుంప మొలకెత్తి, నేలపైకి తల ఎత్తి నిలబడే లోపల, రైతులు కొద్దికాలంలోనే మొలిచి, పెరిగే ఆకుకూరలను భూమి పై పొరలో పండించడం ప్రారంభించారు. చేమదుంప ఆలస్యంగా మొలకెత్తేది కాబట్టి పూర్తిగా కాపుకు రావడానికి పట్టే వ్యవధి 7-8 నెలలు ఉంటుంది. అందువలన రైతులు ఈ చేమదుంప తోటలలో మరిన్ని ప్రయోగాలు చేశారు. చివరికి చేమదుంపను నాటే లోతును 10-20 సెం.మీల నుండి 20-30 సెం.మీ.కు మారుస్తూ, నేలలో నిలువుగా జాగా కలిసివచ్చేటట్టుగా చేస్తూ ఒకేసారి బంగాళాదుంపను కూడా చేమదుంప పెరిగే నేల పైపొరలో పండించే ఏర్పాటు చేశారు.

నేలలో అంతస్థులుగా (బహుళ పొరలలో) విత్తనాలను నాటే పద్ధతి భూమి విస్తీర్ణాన్ని పెంచకుండానే మరికొన్ని రకాల కూరగాయల సాగుకు అదనపు స్థలాన్ని సమర్ధవంతంగా అందించింది.

రైతులు ఇప్పుడు బహుళ పొరలలో మూడు వివిధ రకాలైన కూరగాయ పంటలకోసం అంటే చేమదుంప, బంగాళాదుంప, ఆకుకూరల విత్తనాలు లేదా విత్తనదుంపలను బాగా లోతు పొరలో, మధ్య పొరలో, పైపొరలో ఒకేసారి ఒకే పంట భూమిలో నాటే సాంకేతిక పరిజ్ఞానంతో ముందు కొచ్చారు. బహుళ పొరలలో సేద్యం అని పిలువబడే ప్రజాదరణ పొందిన ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, రైతులు ఒక యూనిట్ స్థలం నుండి అధిక స్థాయిలో ఉత్పత్తిని సాధించేందుకు ప్రయత్నాలు చేశారు.

మెరుగైన ఈ సేద్యపు పద్ధతిననుసరిస్తూ రైతులు కొంత పెద్ద పరిమాణంలో ఉండే పంట పొలాలలో జనవరి నెలలో ముందస్తుగా ఈ చేమదుంప పంటను వేస్తారు. చేమదుంపకు పైభాగాన బంగాళాదుంపను నేలకు 10-15 సెం.మీ లోతులో వేసి, చివరకి నేలపై పొరలో (అంటే 0-5 సెం.మీ లోతున) ఆకుకూరల విత్తనాలను వేస్తారు. నేల పైపొరలో వేసిన పంట (ఆకుకూరలు) వెంటనే మొలకెత్తి 20-25 రోజులలో, అంటే ఫిబ్రవరి చివరికి పంట చేతికొస్తుంది. ఆకుకూరల పంట పండిన వెంటనే, రెండవ పొరలో వేసిన బంగాళా దుంప నేలపైకి మొలకెత్తి వస్తుంది. దీనిని రెండుసార్లు కలుపుతీసి మే నెలలో దుంపను తవ్వి తీస్తారు. బంగాళా దుంప పంట అయిపోయేసరికి చేమదుంప నేల ఉపరితలం పై మొలకెత్తడంతో అక్టోబర్ నెలలో పంట కోతకు వస్తుంది. ఇంకా చేమదుంప వేసిన అవే పొలాలలో నవంబర్, డిసెంబర్ నెలలలో, దేశవ్యాప్తంగా అధిక డిమాండ్ కలిగి, చలికాలంలో నాటడానికి ఉపయోగించే ఉల్లినారును పెంచుతున్నారు. సాధారణంగా చిన్నవైన మరియు బహుళ పొరలలో విత్తనాలను నాటే పద్ధతి ద్వారా సేద్యం చేయని, మిగిలిన పొలాలలో వైవిధ్యంతో ఉండే, సీజనుకు తగ్గట్టుగా ఉండే కూరగాయలని, సంవత్సరం పొడుగునా పండించడం జరుగుతుంది. దగ్గరలో ఉండే మార్కెట్లలో ఈ కూరగాయలు రైతులు నేరుగా అమ్మడం కానీ లేక గ్రామంలో ఎవరైనా ఒకరు వాటిని కొని, దగ్గరలో ఉండే మార్కెట్‌కు అమ్మివేయడం గానీ జరుగుతుంది.

ఒకే స్థలంలో మూడు పంటలను పండించడం సహజం గానే పంటలలో నీటికి, పోషక పదార్థాలకు పోటీకి దారి తీస్తుంది. ఏమైనప్పటికీ బహుళ పొరలలో విత్తనాలను నాటడం అనే పద్ధతి ప్రస్తుత సందర్భంలో మక్రావ్ గ్రామంలో అనుసరించబడడంతో రైతులు, ఈ పోటీలోని రెండు అంశాలూ కూడా సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా ప్రవహిస్తూ ఉండే నీటి వనరులను తీసుకుని సిమెంట్ ట్యాంకులలో నిల్వచేయడంతో సేద్యానికి, వేసవికాలంలో కూడా నీటికి కొరత ఉండదు.

ఇంతేకాకుండా రైతులు (సాధారణంగా ఏకాభిప్రాయం ఆధారంగా) సేద్యపు నీటి పారుదల కోసం ఒక రొటేషనల్ (మార్పిడి) విధానాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ పద్ధతి ద్వారా ప్రతి రైతు తన భూమికి నీటిపారుదల అవకాశాన్ని పొందుతాడు. బహుళ పొరల పంట భూములలో పోషకపదార్థాల విషయంలో ఉండే పోటీని అధిగమించ డానికి డిసెంబర్ నెలలో విత్తనాలు లేదా విత్తన దుంపలు నాటే ముందు ప్రతి పంట పొలంలోనూ రైతులు దిబ్బ ఎరువును ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ బహుళ పొరల

నీవు చేయవలసింది నీ సవాళ్లను పరిమితం చేసుకోవడం కాదు , నీ పరిమితులను సవాలు చేయడం

పద్ధతి ద్వారా సేద్యం చేయబడే భూమి సాధారణంగా రైతుల నివాసాలకు దగ్గరగానే వుంటుంది. కాబట్టి ఈ పంట పొలాలకు ఎరువును తోలడంలో అంతగా ఇబ్బంది వుండదు. ముఖ్యంగా సరిపోయేంత నీరు, దిబ్బ ఎరువు అందుబాటు ఈ బహుళ పొరల సేద్యపు పద్ధతి మక్రాప్ గ్రామంలో సఫలం కావడానికి దోహదం చేశాయి. మూడు కూరగాయల పంటలు ప్రస్తుతం ఒకేసారిగా పండిస్తూ వుండడంతో ఈ కొత్త పద్ధతిలో చేమదుంపలు పండించే తోటలలో ప్రతి ఒక యూనిట్‌లోనూ కూరగాయల ఉత్పత్తి మరింతంగా పెరిగింది. ఈ పద్ధతిలో పంట పెట్టుబడి ఖర్చుకు ఎనిమిదింతలు దిగుబడి (డబ్బు రూపంలో 1:8 ) వున్నట్లు లెక్క తేలింది. ఇది ఈ ప్రాంత గ్రామాలలో బంగాళాదుంప (1:2) టొమాటో (1:5) క్యాప్సికమ్ (1:2) బఠాణీ (1:2) పంటలు ఏక పంటగా వేసినప్పటి పెట్టుబడులు – దిగుబడుల నిష్పత్తి కంటే చెప్పుకోదగ్గ స్థాయిలో అధికంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

**ముగింపు**

నేలను, నీటి వనరులను వివేకంతో, సమర్థంగా వినియోగించుకోవడంలో మక్రాప్ గ్రామంలో చేపట్టిన బహుళ పొరల కూరగాయల సేద్యం పరిమితమైన భూ వనరుల నుండి పూర్తిస్థాయిలో ప్రయోజనాలను పొందడానికి అత్యుత్తమమైన ఉదాహరణ. అలాగే మార్కెట్లు అందు బాటులో ఉండడం కూడా ఇటువంటి సేద్యపు నవకల్పన లకు ముఖ్యమైన దోహదకారి అవుతుంది. ఈ ప్రాంతంలో ఈ గ్రామం ఆదర్శవంతమైన వ్యవసాయ గ్రామంగా పరిగణించబడుతోంది.

**(లీసా ఇండియా పత్రిక సౌజన్యంతో)** ■

# కాలి పగుళ్ళకు చిట్కా వైద్యం !

**శీ**తాకాలం... వేసవి కాలం.. కొందరిని వర్షాకాలం లోనూ కాలి పగుళ్ల సమస్య తీవ్రంగా వేధిస్తుంటుంది. ఈ సమస్య కారణంగా చూడడానికి పాదాలు ఎబ్బెట్టుగా కనిపిస్తాయి. స్త్రీలకు అందమైన పాదాలు ఓ పెద్ద అసెట్ అని తెలిసిందే కదా.. చాలామంది రకరకాల చిట్కాలు పాటిస్తుంటారు.. మరికొందరు వైద్యుల సలహాతో వివిధరకాల మందులు వాడినా ఆశించిన ఫలితం లేక విసుగు చెందిన వారూ ఉంటారు. అలాంటి వారికి నిపుణులు సూచిస్తున్న ఈ చిట్కాలను గురించి తెలుసుకుందాం.



తగినంత తేమ లేకపోవడం, ఎక్కువగా తడిలో పాదాలు నానుతుండడం, మురికికి ఎక్కువగా ఎక్స్‌పోజ్ కావడం కాలి పగుళ్ల సమస్యకు ప్రధాన కారణాలు. అధిక శాతం మందికి పాద సంరక్షణపై పెద్దగా శ్రద్ధ ఉండదు. పగుళ్ల సమస్యను నిర్లక్ష్యం చేస్తే పాదాలు ఎర్రబారి, వాచి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. ఫంగల్ ఇన్ ఫెక్షన్ కూడా దారి తీయవచ్చు.

కొవ్వొత్తి వెలుగునివ్వడమే కాదు పాదాలకు ఓ రూపు నిస్తుంది. మైనం ఆవనూనెతో కలిపి రాత్రి పూట పగుళ్లపై రాసి చూడండి. తెల్లవారేసరికి మార్పును గమనిస్తారు. గ్లిజరిన్, రోజ్ వాటర్ తో కలిపి 15 రోజుల పాటు రోజూ రాత్రి నిద్రించడానికి ముందు రాసి చూడండి.

నువ్వుల నూనె కూడా ఈ సమస్య నివారణకు పని చేస్తుందట. నిద్రించే ముందు పాదాలకు మర్ధన చేయాలి.

అరటి పండు గుజ్జు కూడా పగుళ్లపై మంచి ఔషధంగా పనిచేస్తుంది. పగుళ్లు తొందరగా మానిపోయేలా చేస్తుంది.

పసుపు, తులసి , కర్పూరం సమాన మొత్తాల్లో తీసుకుని వీటికి అలోవెరా జెల్ కలిపి రాసి చూస్తే మంచి ఫలితం ఉంటుందని అంటున్నారు నిపుణులు. ■

# రైతు సంస్థలకు నాబ్ కిసాన్ రుణాలు

## సరైన వ్యాపార ప్రణాళికలతో వస్తే రుణాలిస్తాం: నాబార్డు ఛైర్మన్ జి ఆర్ చింతల

**బ్యాం**కుల నుంచి రుణాల విషయంలో కొన్నేళ్ళ కిందట పొదుపు సంఘాలకు ఎదురైన ఇబ్బందులే ఇప్పుడు రైతు ఉత్పత్తి సంస్థలకూ వస్తున్నాయని నాబార్డు ఛైర్మన్ జీఆర్ చింతల తెలిపారు. అభివద్ధి కావాలంటే రుణం తీసుకోవడం ముఖ్యం. సరైన వ్యాపార ప్రణాళికలతో వస్తే... నాబార్డు ఆధ్వర్యంలోని నాబ్ కిసాన్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తాం' అని ఆయన వివరించారు. వారాహి రైతు ఉత్పత్తి సంస్థ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో నిర్వహించిన ఎఫ్‌పీఓ డైరక్టర్ల సమావేశంలో జీఆర్ చింతల, నాబ్ కిసాన్ ఎండీ సుశీల చింతల పాల్గొన్నారు.

ఈసందర్భంగా జీఆర్ చింతల మాట్లాడుతూ... రైతు ఉత్పత్తి సంస్థలతో ఏర్పాటయ్యే సమాఖ్యలకు ఎలాంటి సాయం అందించాలనే విషయమై ఆలోచనలు చేస్తామని తెలిపారు. 'మన భూముల్లో సేంద్రియ కర్బన శాతం తక్కువ. ఇలాగే కొనసాగితే నేల చచ్చుబడిపోతుంది. 1960-70లో కిలో యూరియాతో 14 కిలోల ఆహారధాన్యాల ఉత్పత్తి వస్తే... ఇప్పుడు కిలో యూరియాకు 1.1 కిలోలే వస్తున్నాయి. పరిస్థితి మారాలి. సేంద్రియ కర్బనాన్ని పెంచుకోవాలి' అని జీఆర్ చింతల సూచించారు. "పల్నాడులాగే ఉండే బుందేల్ ఖండ్‌లో రైతుల వార్షికాదాయం గతంలో 41 వేల రూపాయలుండేది. సమ్మిళిత వ్యవసాయ విధానంతో ఇప్పుడది 3.50-4 లక్షల రూపాయల స్థాయికి పెరిగింది" అని వివరించారు. రైతు ఉత్పత్తి సంస్థలకు తక్కువ వడ్డీకే రుణం అందిస్తామని నాబ్ కిసాన్ ఎండీ సుశీల చింతల తెలిపారు. 'వడ్డీ 9% ఉంటే... అందులో 3% రాయితీ ఉంటుంది. రైతులకు 6% వడ్డీకే రుణం లభిస్తుంది' అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో రుణ మంజూరుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. రైతుల అవసరాలు తెలుసుకుని... అందుకు అనుగుణంగా వచ్చే ఒకటి, రెండేళ్లలో మరిన్ని సంస్థలకు రుణం అందించేలా కృషి చేస్తాం" అని పేర్కొన్నారు. 'ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ పెరుగుతోంది. విజయవాడలోనే ఇప్పుడు 50 వరకు దుకాణాలు ఏర్పాటయ్యాయి' అని గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం ఛైర్మన్ ముత్తవరపు మురళీకృష్ణ చెప్పారు. భారతయ కిసాన్‌సంఘ్ జాతయ కార్యనిర్వాహక సభ్యుడు కుమారస్వామి, నాబార్డు సీజీఎం సుధీర్ కుమార్ జన్నావార్ మాట్లాడారు. ■

### నిద్ర ఎక్కువైనా, తక్కువైనా ... మగాళ్లకు మధుమేహం!

నిద్రలేమితో ఆరోగ్యం చెడుతుంది. అతినిద్ర కూడా ప్రమాదకరమే! ముఖ్యంగా నిద్ర ఎక్కువైనా, తక్కువైనా పురుషులకే యమా డేంజర్! రోజూ సగటున 7 గంటల కన్నా ఎక్కువసేపు లేదా తక్కువ సేపు నిద్రపోయే మగాళ్ళకు మధుమేహం వచ్చే ముప్పు ఎక్కువని నెదర్లాండ్స్‌లోని వీయూ మెడికల్ సెంటర్ అధ్యయనంలో వెల్లడైంది. పరిశోధనలో భాగంగా 14 యూరోపియన్ దేశాలకు చెందిన 90-60 ఏళ్ళ మధ్య ఉన్న 800 మంది వలంటీర్లపై అధ్యయనం చేశారు. ఆడ, మగవారిలో నిద్రపోయే సమయం, వారిలో గ్లూకోజ్ జీవక్రియ జరిగే విధానాన్ని పరిశీలించారు. అతినిద్ర, నిద్రలేమికి గురైన పురుషుల్లో శరీర కణాలు ఇన్సులిన్ హార్మోన్‌కు ప్రతి స్పందించడం తగ్గిపోయింది. గ్లూకోజ్‌ను విని యోగించుకునే సామర్థ్యమూ మందగించింది. దీంతో డయాబెటిస్ వచ్చే ముప్పు పెరిగింది. వీరిలో బీపీస్థాయిలు కూడా పెరిగినట్లు గుర్తించారు. అయితే మహిళలు మాత్రం ఎక్కువ / తక్కువ నిద్రపోయినా గ్లూకోజ్ జీవ క్రియకు ఆటంకాలు ఏర్పడకపోగా, ఆ ప్రక్రియ మరింత మెరుగు పడిందని పరిశోధన బృందం సారధి ఫెంకే రూటర్స్ వెల్లడించారు. క్లోమంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాల పనితీరూ పెరిగిందని వివరించారు. ■

# పశువులకు అన్ని కాలాల్లో పచ్చి మేతను ఇచ్చే పశుగ్రాసాలు

పశుగ్రాసాలలో అన్ని కాలాల్లో పచ్చిమేతను అందించే బహు వార్షిక పశుగ్రాసాలు, ఏక వార్షిక పశుగ్రాసాలు అని రెండు రకాలుగా వున్నాయి.

ఏక వార్షిక పశుగ్రాసాలలో ముఖ్యమైనవి జొన్న, మొక్కజొన్న, సజ్జలు, తీగజాతి (లెగ్యూం) రకాలైన జనుము, ఉలవలు, పిల్లిపెసర, అలసందలు. బహు వార్షిక పశుగ్రాసాలలో హైబ్రిడ్ నేపియర్, పారగడ్డి, స్టైలో, లూసర్న్ ముఖ్యమైనవి.

ఇవి కాకుండా పశుగ్రాసచెట్లు, అవిసె, సుబాబుల్, హెడ్జ్ లూసర్న్ మొదలగు చెట్లను పెంచవచ్చు.

**ఏక వార్షిక పశుగ్రాసాలు**

**జొన్న**

జొన్న పంటని ప్రధాన పశుగ్రాసంగా చెప్పవచ్చు. జొన్న పంటలో రెండు రకాలు వున్నాయి.

అవి
1. ఒకే కోతనిచ్చేవి.
2. పలు కోతలనిచ్చేవి.

| | | |
|---|---|---|
| ఒకే కోతనిచ్చే రకాలు | : | సి.యస్.వి.15, సి.యస్.హెచ్ 13, యస్.యస్.వి.84 మొదలైనవి |
| పలు కోతలనిచ్చే రకాలు | : | యస్.యస్.జి.59-3, పి.సి. 106, యస్.యస్.జి.988 |
| విత్తనం | : | ఎకరానికి 6-8 కిలోల విత్తనం సరిపోతుంది. |
| ఎడం | : | సాలుకు సాలుకు మధ్యలో 30 సెం.మీ ఎడంగా విత్తాలి. |
| ఎరువులు కిలోలు | : | మెట్టపంటకు ఎకరానికి 24 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 పొటాష్ నిచ్చే ఎరువులు సరిపోతాయి. |
| నీటిపారుదల క్రింద | : | 40 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు సరిపోతాయి. |
| విత్తే సమయం | : | జూన్-జులై మాసంలో వర్షాధారంగా సెప్టెంబర్ మాఘీ పంటగా, అక్టోబర్‌లో రబీ పంటగా, జనవరిలో ఎండాకాలం పంటగా విత్తుకోవచ్చు. |
| ఎరువులు వాడకం | : | నత్రజని ఎరువులు విత్తేటప్పుడు, విత్తిన 35రోజుల వరకు, అటు ప్రతి కోత తర్వాత ఎరువులు వేయాలి. |
| పంట కోత | : | 50 శాతం పూత దశలో పంటను పశుగ్రాసంగా వాడుకోవచ్చును. తదుపరి కోతలు 45 రోజులు వ్యవధిలో తీసుకోవాలి. |
| దిగుబడి | : | ఎకరానికి 6-8 టన్నులు, పచ్చి పశుగ్రాసాన్ని పొందవచ్చు. |
| తీసుకోవలసిన జాగ్రత్తలు | : | జొన్నను గింజ పట్టకముందు కోసి మేపరాదు. |

భయంతో ఎక్కడికని పారిపోతావ్ ? ఆ భయం వున్నదే నీ గుండెలో

<u>మొక్కజొన్న</u>

| | | |
|---|---|---|
| రకాలు | : | ఆఫ్రికన్ టాల్, విజయ్, కిసాన్, గంగా-2.5, హెచ్‌జిటి-3, జవహర్ మోతి కాంపోజిట్ |
| విత్తే సమయం | : | జూన్ - ఆగస్ట్, జనవరి - మే (నీటి వసతి ఉన్నప్పుడు) |
| విత్తనం | : | 20 - 24 కిలోలు ఒక ఎకరానికి సరిపోతుంది. |
| ఎరువులు వాడకం | : | 48 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం (ఒక ఎకరానికి) |
| నీటి తడులు | : | 7 నుండి 10 రోజులు వ్యవధికి ఒక్కసారి |
| కత్తిరింపు | : | 70 - 75 రోజులు |
| కత్తిరింపుల సంఖ్య | : | ఒక్కసారి (1) |
| దిగుబడి | : | పచ్చిగడ్డి - ఒక ఎకరానికి 160 నుండి 200 క్వింటాళ్ళు. ఎండు గడ్డి - ఒక ఎకరానికి 40 నుండి 50 క్వింటాళ్ళు. |
| పచ్చి మాంసకృత్తులు | : | 7.2 |
| ప్రత్యేక లక్షణాలు | : | ఆసిడ్ మట్టి, ఆమ్ల భూములను తట్టుకుంటుంది. |

<u>సజ్జ</u>

| | | |
|---|---|---|
| రకాలు | : | జెయంట్, రాజ్‌కొ, కె-599, టి.55, ఎ.పి.కాంప్లెక్స్, ఎల్-72, ఎల్ 74 |
| విత్తే సమయం | : | జూన్ - ఆగస్ట్, జనవరి - మే (నీటి వసతి ఉన్నప్పుడు) |
| విత్తనం | : | 1.6-2 కిలోలు ఒక ఎకరానికి |
| విత్తే దూరం | : | 30 సెం.మీ |
| ఎరువులు వాడకం | : | 36 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం (ఒక ఎకరానికి) |
| నీటి తడులు | : | 15 నుండి 20 రోజులు వ్యవధికి ఒక్కసారి |
| కత్తిరింపు దశ | : | 50 శాతం (పువ్వుతో ఉన్నప్పుడు) |
| కత్తిరింపు | : | 55 - 60 (35-40) రోజులకు |
| కత్తిరింపుల సంఖ్య | : | రెండుసార్లు (2) |
| దిగుబడి | : | పచ్చి గడ్డి - ఒక ఎకరానికి 160 నుండి 200 క్వింటాళ్ళు. ఎండు గడ్డి - ఒక ఎకరానికి 40 నుండి 50 క్వింటాళ్ళు |
| పచ్చి మాంసకృత్తులు | : | 6.9 |

<u>టియోసింటె</u>

| | | |
|---|---|---|
| రకాలు | : | మేలైన సిర సా |
| విత్తే సమయం | : | జూన్ - ఆగస్ట్, ఫిబ్రవరి - మే (నీటి వసతి ఉన్నప్పుడు) |
| విత్తనం | : | 16 కిలోలు ఒక ఎకరానికి |
| విత్తే దూరం | : | 30 సెం.మీ |
| ఎరువులు వాడకం | : | 40 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం (ఒక ఎకరానికి) |

నిన్ను పదేపదే వేధించే వారివల్ల నీ ఆత్మబలం పెరుగుతున్నట్టు, వారి బలం క్షీణిస్తున్నట్టు

| | | |
|---|---|---|
| నీటి తడులు | : | 15 నుండి 20 రోజులు వ్యవధికి ఒక్కసారి |
| కత్తిరింపు దశ | : | 55-60 రోజులకు మొదటి కత్తిరింపు. తరువాత 35-40 రోజులకు |
| కత్తిరింపు | : | మొదట దశలో 50 శాతం కంకి వచ్చినప్పుడు |
| కత్తిరింపుల సంఖ్య | : | రెండుసార్లు (2) |
| దిగుబడి | : | పచ్చి గడ్డి - ఒక ఎకరానికి 160 నుండి 200 క్వింటాళ్ళు. ఎండు గడ్డి - ఒక ఎకరానికి 40 నుండి 50 క్వింటాళ్ళు |
| పచ్చి మాంసకృత్తులు | : | 5.6 |
| ప్రత్యేక లక్షణాలు | : | ఆమ్ల భూములలో పంట తట్టుకుంటుంది. మరియొకసారి |

<u>సూడాన్ గడ్డి</u>

| | | |
|---|---|---|
| రకాలు | : | ఎస్.ఎస్.జి. 59 - 3 |
| విత్తే సమయం | : | జూన్ - జులై, జనవరి - మే (నీటి వసతి ఉన్నప్పుడు) |
| విత్తనం | : | 6 కిలోలు ఒక ఎకరానికి |
| విత్తే దూరం | : | 30 సెం.మీ |
| ఎరువులు వాడకం | : | 32 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం (ఒక ఎకరానికి) |
| నీటి తడులు | : | 15 నుండి 20 రోజులు వ్యవధికి ఒక్కసారి |
| కత్తిరింపు దశ | : | 45-50 రోజులకు, 30-35 రోజులకు వట్టి కత్తిరింపు వస్తుంది. |
| పూర్తి కత్తిరింపు | : | 55 - 60 రోజులకు |
| కత్తిరింపుల సంఖ్య | : | నాలుగు నుండి ఐదు (5) |
| దిగుబడి | : | పచ్చి గడ్డి - ఒక ఎకరానికి 160 నుండి 200 క్వింటాళ్ళు. ఎండు గడ్డి - ఒక ఎకరానికి 40 నుండి 50 క్వింటాళ్ళు |
| పచ్చి మాంసకృత్తులు | : | 5.7 |
| ప్రత్యేక లక్షణాలు | : | క్షార భూములలో పెరుగుతుంది. |

<u>ఏక వార్షిక తీగ జాతి (లెగ్యూం) రకాలు</u>

<u>జనుము</u>

| | | |
|---|---|---|
| నేలలు | : | అన్ని రకాల నేలలు అనుకూలం |
| విత్తే సమయం | : | అక్టోబర్ - మార్చి వరకు సాగు చేయవచ్చు. |
| విత్తనం | : | 16 కిలోలు ఒక ఎకరానికి విత్తనం వెదజల్లే పద్ధతిలో సరిపోతుంది. |
| ఎరువులు వాడకం | : | 16-24 కిలోల భాస్వరం (ఒక ఎకరానికి) |
| నీటి తడులు | : | 1 లేదా 2 తడులు |
| కత్తిరింపు దశ | : | జనుము పంట 50 శాతం పూత దశలో కోసి నీడలో ఎండబెట్టాలి (50-60 రోజులకు) |
| కత్తిరింపుల సంఖ్య | : | ఒక్కసారి |

చుట్టూ చూడగలిగినవారు కలలు కంటారు, తమ గుండె లోతులు చూడగలిగినవారు మేల్కొంటారు

దిగుబడి : ఎకరానికి 5 - 6 టన్నులు దిగుబడిని పొందవచ్చు.
నేలలు : అన్ని రకాల నేలలు అనుకూలం
విత్తే సమయం : జూన్ - సెప్టెంబర్ (ఖరీఫ్), సెప్టెంబర్ - డిశంబర్ (మాఘి)
విత్తనం : 12 - 16 కిలోలు విత్తనం అవసరం (ఒక ఎకరానికి)
ఎరువులు వాడకం : 18-21 కిలోల భాస్వరం దుక్కిలో వేసుకోవాలి. (ఒక ఎకరానికి)
నీటి తడులు : 1 లేదా 2 తడులు సరిపోతుంది.
కత్తిరింపు దశ : పూత దశ లేదా చిరుకాయ దశలో కోయాలి.
కత్తిరింపుల సంఖ్య : ఒక్కసారి
దిగుబడి : ఎకరానికి 10 - 12 టన్నులు పశుగ్రాసాన్ని ఇస్తుంది.

<u>పిల్లి పెసర</u>

<u>పశువులు పచ్చి రొట్టెగా ఇష్టంగా తినే పంట</u>

నేలలు : అన్ని రకాల నేలలు అనుకూలం
విత్తే సమయం : జూన్ - ఆగస్ట్ (ఖరీఫ్), డిశంబర్ - ఫిబ్రవరి (రబీ)
విత్తనం : 8 - 10 కిలోలు విత్తనం అవసరం (ఒక ఎకరానికి)
ఎరువులు వాడకం : 8 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం
నీటి తడులు : 2 లేదా 3 తడులు
కత్తిరింపు దశ : 50 శాతం పూత దశ మొదటి కోత తదుపరి 30 నుంచి 35 రోజులకొకసారి కోరలు తీసుకోవచ్చు
దిగుబడి : ఎకరానికి 2 - 4 టన్నులు ఇస్తుంది.

<u>అలసందలు</u>

రకాలు : యు.పి.సి.287, ఇ.సి. 4216, ఎస్.పి.3, యు.పి.సి.5286, రష్యన్ జెయంట్
విత్తే సమయం : జూన్ - జులై, ఫిబ్రవరి - జూన్ (నీటి పారుదల క్రింద)
కావలసిన విత్తనాలు : 30 - 40 కిలోలు విత్తనం అవసరం
విత్తు పద్ధతి : వరుసల మధ్య అంతరము 45 సెం.మీ.
ఎరువులు వాడకం : 20 కిలోల నత్రజని, 16 కిలోల పొటాష్ (ఒక హెక్టారుకు)
నీటి తడులు : 12 లేదా 15 రోజులకు
మొదటి కోత : 55 - 60 రోజులకు పూత దశలో
కోతలు : ఒకసారి మాత్రమే
దిగుబడి : పచ్చిమేత 30 నుండి 35 టన్నులు ఇస్తుంది.

(ఆధారము : కృషి విజ్ఞాన కేంద్రము కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ సంతోషనగర్, సైదాబాద్, హైద్రాబాద్) ■

వెలుగులో వెలిగేవారు చీకటిలో కనుమరుగవుతారు, వ్యక్తిత్వపు వెలుగు వుంటే చీకటి వెలవెలపోతుంది

# రైతులను ఆదుకోవడమే ఏపిమాస్ లక్ష్యం

## ఏపిమాస్ కార్యక్రమాలకు హార్టీకల్చర్ డి డి ప్రశంస



రైతులను ఆదుకోవడమే ఏపిమాస్ (మహిళా అభివృద్ధి సొసైటీ)లక్ష్యమని, రైతులకు తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు, పనిముట్లు తదితర వాటిని అందచేస్తున్నారని హార్టికల్చర్ డిప్యూటీ డైరక్టర్ శ్రీ శ్రీనివాసులు పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని గుడియాత్తం రోడ్డు నందు గల ఏపిమాస్ కార్యాలయం వద్ద ఈ కార్యాలయం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా సొసైటీకి సంబంధించిన రైతులతో సమావేశాన్ని నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రీన్ ఆపరేషన్ తరఫున రైతులు పండించే టమాట, మామిడి ఉత్పత్తులను ఈ యూనిట్ ద్వారా శుద్ధి చేసి ప్యాకింగ్ చేపట్టి ఇతర కంపెనీలకు పంపడం జరుగుతోందన్నారు. వీటి నిమిత్తం పట్టణ సమీపంలోని కేటిల్ ఫాం వద్ద ఒక ఎకరా స్థలాన్ని కూడా కేటాయించడం జరిగిందన్నారు.

గ్రీన్ ఆపరేషన్ అనుసంధానంగా పాలీహౌస్, మోడల్ నర్సరీలచే రైతులకు పలురకాల నారును ఈ నర్సరీల నుండి పంపకాలు చేపట్టనున్నామన్నారు. పాలీ హౌస్‌కు 22 లక్షలు, మోడల్ నర్సరీకి 13 లక్షల చొప్పున కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది లాభనష్టాలను చూడడం జరిగిందని, మొత్తం 44 లక్షలు టర్నోవర్ అయ్యిందని, దీంతో 3 లక్షల 80 వేల రూపాయలు ఆదాయం చేకూరిందన్నారు. రైతుల వద్ద తక్కువ రేటు టమాటలు ధర పలికినప్పుడు సొసైటీ తరఫున కొనుగోలు చేసి జ్యూస్ తయారీ కంపెనీలకు తరలించి రైతులకు గిట్టుబాటు ధరను కల్పించామన్నారు. ఈమేరకు 110 టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను టెంపోల ద్వారా సరఫరా చేశామన్నారు. జర్మనీ ప్రభుత్వంతో కలిసి జ్యూస్ నిమిత్తం మార్కెటింగ్ చేపడుతున్నామన్నారు.

రైతులకు టమాట, మామిడికాయలను తరలించేందుకు క్రేట్‌లు, డిఏపి ఎరువులు, పనిముట్లు తదితర వాటిని ప్రత్యేక రాయితీతో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందజేస్తున్నా మన్నారు. ఇప్పటికే ఇందులో 764 మంది సభ్యులు వున్నారన్నారు. గ్రామసమాఖ్యలు కూడా సభ్యులుగా వున్నాయన్నారు.

హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఏపిమాస్ శాఖా కార్యాలయాన్ని పలమనేరులో 2018 జనవరి 1వ తేదీన ప్రారంభించారని, అంచెలంచెలుగా ఈ కంపెనీ విస్తృతంగా ఎదిగి ప్రస్తుతం పలమనేరు రూరల్‌లోని 7 పంచాయితీల పరిధిలో సొసైటీ ద్వారా రైతులకు ఎంతో తోడ్పాటును ఆందిస్తుందని తెలిపారు. హార్టీకల్చర్ హెచ్ఓ శ్రీనివాసులురెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ ప్రహ్లాద, డైరక్టర్ , అధ్యక్షులు అమరేంద్ర, మనోజ్ రెడ్డి, వెంకటరమణ, కవిత, ధనుంజయ లతో పాటు ఏపిమాస్ సిఇఓ వాణి తదితరులు పాల్గొన్నారు. ■

ఒకరిని అంచనావేయడం వల్ల వారెలాంటివారో తెలిసే కన్న నీవెలాంటివాడివో తెలుస్తుంది.

వాళ్ళ ఇంటి లోపల ఎవరైనా టాయిలెట్ నిర్మించవచ్చు ప్రభుత్వ సబ్సిడీ మరియు రుణ సహాయంతో

- మరుగుదొడ్డిని నిర్మించుకునేందుకు ప్రభుత్వ సబ్సిడీ పొందండి
- ఎస్‌హెచ్‌జిలు/బ్యాంకులు/నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందండి
- మరింత సమాచారం కోసం, పంచాయతీ అధికారి/ప్రభుత్వ అధికారి/ఎన్‌జిఓను సంప్రదించండి



పరిశుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, సంతోషకరమైన గ్రామం

- మరుగుదొడ్డి ఉపయోగించడం సౌలభ్యంగా ఉంటుంది
- పిల్లలు మరియు మహిళలకు భయం మరియు సిగ్గుపడవలసిన అవసరం లేదు
- వ్యాధుల వ్యాప్తిని నివారించండి
- పిల్లల చదువు లేదా కుటుంబ ఆదాయం ప్రతికూలంగా ప్రభావితం కావు

- రెండు గుంతల నిర్మించండి
- నీటి కనెక్షన్ ఇన్‌స్టల్ చేయండి
- సులభ లోన్ పొందండి
- మీ కుటుంబాన్ని సంతోషపెట్టండి



नाबार्ड



नाबार्ड

# స్వచ్ఛత ఉద్యమం

రోజూ మరుగుదొడ్డి ఉపయోగించండి
మీ కుటుంబంలో ఆరోగ్యం మరియు సంతోషం నింపండి



అభివృద్ధి
— కోసం —
పారిశుధ్యం
— నాబార్డు సౌజన్యంతో —
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి

## బహిర్భూమికి వెళ్ళడం అంటే మీ ఇబ్బందులను పెంచుకోవడమే:



జబ్బులు- అతిసారం, నీళ్ళ విరేచనాలు, కరోనా వైరస్ ఇన్ఫెక్షన్.



కాలుష్యం- భూమి కాలుష్యం, నీటి కాలుష్యం



మహిళలకు భయం మరియు సిగ్గు

## ఇంట్లో మరుగుదొడ్డి ఉండగా బహిర్భూమికి ఎందుకు వెళ్ళాలి?



నీటి కనెక్షన్ లేదా?



మరుగుదొడ్డి గుంత నిండిపోయిందా?



మరుగుదొడ్డికి మరమ్మతులు అవసరమా?

## పరిష్కారాలు సులభమమైనవి:



మీ మరుగుదొడ్డి నీటి కనెక్షన్ పొందండి



మా మరుగుదొడ్డి జత గుంతలు నిర్మించుకోండి



అవసరమైతే మీ మరుగుదొడ్డి రెండు గుంతల మరుగుదొడ్డి నిర్మించండి



నీటి సదుపాయం కల్పించండి

MAHILA SADHIKARATHA
Publication Date: 01-09-2021; Posting Date: 05 & 06-09-2021

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23





వాష్ కార్యక్రమ సి ఆర్ పిలతో నిర్వహించిన సమీక్షా సమావేశం దృశ్యాలు





మహిళా విశ్వవిద్యాలయ విద్యార్థులకు శిక్షణ ... హిరేహళ్లిలో రైతు ప్రతినిధుల అవగాహన పర్యటన ... మారెళ్ళలో పశువైద్య శిబిరం





కనిగిరిలో 'వాష్' కార్యక్రమంపై కౌన్సిలర్లకు, టి ఎల్ ఎఫ్ ఇ సి సభ్యులకు శిక్షణ





పీలేరు ఎఫ్ పి సి తృతీయ వార్షికోత్సవ మహాసభ ... మరికొన్ని దృశ్యాలు




కలికిరి రైతు సమృద్ధి సేవా కేంద్రం ప్రారంభోత్సవ సమావేశం ... నల్లమడ ఎఫ్ పి ఓ వార్షికోత్సవ సభలో ప్రతినిధుల ప్రమాణం

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089